బై బై గణేశా..!



అంతర్వేదిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

బైబై గణేశా అంటూ.. భక్తులు వినాయక విగ్రహాలను నిమ్మజనం చేశారు. గణపతి నవరాత్రులు ముగుస్తుండడంతో జిల్లావ్యాప్తంగా పలుచోట్ల గురువారం వినాయకులను ఊరేగింపుగా తీసుకువచ్చి కాలువలు, గోదావరి, సముద్రతీర ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు.

రాజోలు ఏఎంసీ చైర్మన్‌గా వెంకటలక్ష్మి నియామకం



రాజోలు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):రాజోలు ఏఎంసీ చైర్మన్‌గా రాజోలు మండలం తాటిపాకకు చెందిన కేతా వెంకటలక్ష్మిని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని టీడీపీ అగ్రనేతలు తరలివచ్చి శ్రీను భార్య వెంకటలక్ష్మికి హామీఇచ్చారు. ఆమెకు సముచిత స్థానం కల్పిస్తామని హామీఇచ్చారు. ఇప్పుడు ఆమెను రాజోలు ఏఎంసీ చైర్మన్‌గా నియమించడంపట్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఆమె టీడీపీ మహిళా నాయకురాలిగా భర్త శ్రీనుతోపాటు చురుగ్గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. తన నియామకానికి కృషిచేసిన రాజోలు ఎమ్మెల్యే దేవవర ప్రసాద్, రాష్ట్రపొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ్య సభ్యుడు సానా సతీష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎంపీ హరీష్, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్‌లకు వెంకటలక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీ పటిష్టతకు తాను కృషి చేస్తానన్నారు.

ఒకరోజు టీచర్లు



ఆత్రేయపురం మండలంలోని ర్యాలి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు

టిప్ టాప్‌గా రెడీ అయ్యి పాఠశాలలో పాఠాలు చెప్పేందుకు వెళ్తున్నట్టుగా ఉన్న వీరిని చూస్తుంటే నిజంగా టీచర్లుగానే ఉన్నారు కదూ.. నేడు ఉపాధ్యాయ దినోత్సవం కావడంతో ఒకరోజు ముందుగా నిర్వహించిన వేడుకల్లో ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వీరు పాఠశాలను నిర్వహించారు.



'స్థానిక' సందడి!

- ఉమ్మడి తూ.గో.లో మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు ముందస్తు సన్నాహాలు
- మునిసిపల్, పంచాయతీరాజ్‌శాఖలకు లేఖలు రాసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- 2026 జనవరిలోగా మునిసిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు వచ్చే నెల నుంచే సన్నాహాలు
- అక్టోబరు 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ
- నవంబరు 16 నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంల సన్నద్ధత
- ఉమ్మడి జిల్లాలో రెండు కార్పొరేషన్లు, 9 మునిసిపాలిటీలు, 3 నగర పంచాయతీలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికల సందడి కొన్ని నెలల్లో మొదలుకాబోతోంది. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. వచ్చే ఏడాది జనవరిలోగా అంటే మరో ఐదు నెలల్లో మొత్తం ప్రక్రియ పూర్తి చేసి పోలింగ్, ఎన్నికల ఫలితాల ప్రకటనకు కార్యాచరణ సిద్ధం చేసింది. వచ్చే నెల నుంచే మున్సిపాల్టీలు, పంచాయతీల్లో వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ కసరత్తు ప్రారంభించాలని తాజాగా అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి త్వరలోనే మొదలు కానుంది. కాగా ఉమ్మడి జిల్లాలో రెండు కార్పొరేషన్లు, 9 మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో పుర ఎన్నికలు, 1,073 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. కొత్త తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే నిడదవోలు, కొవ్వూరు మున్సిపాలిటీలకు సంబంధించి వార్డుల పునర్విభజన చేయాల్సి ఉన్న నేపథ్యంలో పెరిగే కొత్త వార్డులతో కలిపి ఎన్నికలు నిర్వహించనున్నారు.

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలుకాబోతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలకు, ఆ తర్వాత పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్ఈసీ రంగం సిద్ధంచేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరిలో 2021లో మునిసిపల్, పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఆయా మునిసిపల్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు మెంబర్ల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తికాబోతోంది. ఆ తర్వాత వీటికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే వీరి పదవీకాలం ముగిసేలోపు మూడు నెలల ముందే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈమేరకు పురపాలక, పంచాయతీరాజ్‌శాఖలకు ఎస్ఈసీ లేఖ రాసింది. మున్సిపాల్టీలు, పంచాయతీలకు వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా కసరత్తు ప్రారంభించాలని ఆదేశిస్తూ మార్గదర్శకాలు జారీచేసింది. దీని ప్రకారం వచ్చే నెల 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. అక్టోబరు 16 నుంచి నవంబరు 15లోగా వార్డులవారీగా ఓటర్ల జాబితాల ప్రచురణ, నవంబరు 1 నుంచి 15 లోగా ఎన్నికల అధికారుల నియామకం, నవంబరు 16నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంలను సిద్ధం చేయడం పూర్తిచేయాలని ఆదేశించింది. డిసెంబరు 15లోపు రిజర్వేషన్లు ఖరారు, 2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్, అదే నెలలో ఫలితాల వెల్లడికి వీలుగా ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఇక కాకినాడ కార్పొరేషన్‌కు 2022 సెప్టెంబరుకు అయిదేళ్ల పదవీకాలం పూర్తయిన తర్వాత మళ్లీ ఇప్పటివరకు ఎన్నికలు జరగలేదు. అయితే తాజా ఎస్ఈసీ ఆదేశాల నేపథ్యంలో వార్డుల పునర్విభజనతో అదనంగా మరో పది వార్డుల వరకు పెరిగే అవకాశం ఉంది. అటు రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో శివారు గ్రామాల విలీనం సమస్య పరిష్కారమై పెరిగే వార్డులతో కలిపి ఇక్కడా ఎన్నికలు జరగనున్నాయి. ఇదిలాఉంటే 2021 మార్చిలో ఉమ్మడి జిల్లాలో ఏడు మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో కలిపి మొత్తం 268 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో చేతిలో అధికారం ఉండడంతో వైసీపీ అడ్డగోలుగా 35 వార్డుల్లో బలవంతపు ఏకగ్రీవాలు చేయించింది. దీంతో 233 వార్డులకే ఎన్నికలు జరిగాయి. అయితే మళ్లీ ఇప్పుడు వార్డుల పునర్విభజన నేపథ్యంలో ఒక్కో మున్సిపాల్టీ, నగర పంచాయతీల్లో వార్డుల సంఖ్య మరింత పెరగనుంది. అలాగే ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 1,073 పంచాయతీల్లో నాలుగు దశల్లో 11,782 వార్డులకు 12,048 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు నిర్వహించారు. 31 పంచాయతీలకు వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. వచ్చే ఏడాది జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో వార్డులు మరిన్ని పెరగనున్నాయి.

అప్పుడంతా అరాచకం...

ఉమ్మడి జిల్లాలో 2021లో జరిగిన మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ అరాచకాలు సృష్టించింది. ప్రతిపక్ష టీడీపీ, జనసేనలను నానా హింస పెట్టింది. ఈ పార్టీల అభ్యర్థులను చాలాచోట్ల నామినేషన్లను దాఖలు చేయకుండా అడ్డుకుని ఏకంగా కిడ్నాప్‌లు చేసింది. బెదిరింపులకు దిగి ఏకగ్రీవాలు చేయించుకుంది. అయితే టీడీపీకి బలం ఉన్న చోట జనసేన, జనసేనకు బలం ఉన్న పలు చోట్ల టీడీపీ సహకరించుకుంటూ కదిలి వైసీపీ అరాచకాలను కొంతవరకు అడ్డుకోగలిగాయి. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి అఖండ విజయంతో అధికారంలోకి వచ్చింది. తర్వాత ఒక్కో మున్సిపాల్టీ కూటమి పరిధిలోకి వచ్చేశాయి. తుని, నిడదవోలు, కొవ్వూరు ఇలా కూటమిలో చేరిపోయాయి. ఇంకా కొందరు రావడానికి సిద్ధంగా ఉన్నా ఎన్నికలు జరిగే సమయంలో ఈ తలపోటు మనకెందుకులే అన్నట్టు వదిలేశారు. ఉమ్మడి జిల్లాలో పరిధిలో రాజమండ్రి, కాకినాడ కార్పొరేషన్లు, అమలాపురం, తుని, పిఠాపురం, సామర్లకోట, మండపేట, రామచంద్రపురం, పెద్దాపురం మున్సిపాలిటీలు, ఏలేశ్వరం, గొల్లప్రోలు, ముమ్మిడివరం నగర పంచాయతీలు ఉన్నాయి. అలాగే కొత్త తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కొవ్వూరు డివిజన్ కూడా కలవడం వల్ల కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు కూడా వచ్చి చేరాయి. అంటే 2 కార్పొరేషన్లు, 9 మునిసిపాలిటీలు, 3 నగర పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది.



● రాజకీయ వర్గాల్లో సందడి

మునిసిపల్ ఎన్నికలు అనగానే పట్టణ ప్రాంతంలో రాజకీయ సందడి మొదలవుతోంది. రాజమండ్రి, కాకినాడ కార్పొరేషన్లకు పాలకవర్గాలు లేనందువల్ల అక్కడ ప్రజాప్రతినిధులు, పదవులు ఆశించేవారు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. మిగతా మునిసిపాలిటీల్లో వైసీపీ నేతలు కూడా ఉన్న సంగతి తెలిసిందే. ఈసారి మొత్తం మునిసిపాలిటీలను కైవసం చేసుకోవడానికి టీడీపీ కూటమి సిద్ధమవుతోంది. మొత్తం కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో ఎన్నికలు జరిగితే 300మందికి పైగా కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా ఎన్నికవుతారు. ఇద్దరు మేయర్లు, 12 మంది మున్సిపల్ చైర్మన్లు వస్తారు. డిప్యూటీ మేయర్లు, కోపన్స్ సభ్యుల పేరిట కూడా పలువురికి పదవులు వస్తాయి. ఈనేపథ్యంలో టీడీపీ కూటమిలో బాగా సందడి పెరిగింది. వైసీపీ సరైన ప్రతిపక్షంగా కూడా లేకపోవడం వల్ల ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలనే మీమాంసలో పడింది. పలువురు వైసీపీ నేతలు వీలు దొరికితే కూటమిలోకి దూకేసే ప్రయత్నాలు ఇప్పటికే మొదలుపెట్టారు.

జిల్లాల పునర్విభజన ప్రక్రియ..

జరిగేనా?

- మంత్రుల కమిటీ పర్యటనలు వాయిదా
- రామచంద్రపురాన్ని కాకినాడలో కలపాలని డిమాండ్
- మండపేటను 'తూర్పు'లో కలపాలని ఆందోళన
- స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన నేపథ్యంలో విభజనకు బ్రేక్ పడినట్టేనా?

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాల పునర్విభజన, సరిహద్దుల మార్పు ప్రక్రియ ఆచరణ సాధ్యమయ్యేలా లేదని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మంత్రులతో ఏర్పాటుచేసిన జీవోఎం పర్యటన తేదీలు జిల్లాలవారీగా ఖరారైనప్పటికీ ఆ పర్యటనలు ఎక్కడా జరిగినట్టు దాఖలాలులేవు. దీంతో జిల్లాల పునర్విభజన ప్రక్రియపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక సంస్థలఎన్నికలకు సమాయత్తం కావాలన్న ప్రకటనతో విభజనకు బ్రేక్ పడినట్టేనా అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

పరిస్థితి గందరగోళం

రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మూడు నెలల ముందే సమాయత్తం కావాలని ప్రకటించడంతో ఇప్పుడు పరిస్థితి గందరగోళంగా మారింది. ఎందువల్లంటే జిల్లాలు యూనిట్‌గా స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, పంచాయతీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు పదవులు లాటరీ ద్వారా రిజర్వేషన్ల ప్రక్రియను ఎంపిక చేస్తారు. దీంతో అక్టోబరు నుంచే స్థానిక సంస్థల ఎన్నికల హడావిడి ప్రారంభమయ్యే అవకాశాలు ఉండడంతో జిల్లాల పునర్విభజన ప్రక్రియ అమలుపై నీళ్లు వదులుకోవాల్సిందేనని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కోనసీమ జిల్లా పరిధిలో రెండు నియోజకవర్గాలను ఇతర జిల్లాల్లో విలీనం చేయాలనే డిమాండ్‌తో కొన్నిరోజులుగా రాజకీయాలకు అతీతంగా అఖిలపక్ష పార్టీలు సమావేశమై తీర్మానాలు సైతం ఆమోదించాయి. ఉద్యమాలు చేపట్టాయి. సభలు సమావేశాలు నిర్వహించాయి. ముఖ్యంగా జిల్లా పరిధిలో మంత్రి సుభాష్ ప్రాతినిథ్యం వహిస్తున్న రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో కలపాలని డిమాండ్ కొనసాగుతోంది. టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రాతినిథ్యం వహిస్తున్న మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలనే డిమాండ్లతో ఉద్యమాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే రామచంద్రపురంలోని కాజులూరు మండలాన్ని కాకినాడ జిల్లాలోనే కలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని తాళ్లరేవు మండలాన్ని కాకినాడలో విలీనం చేశారు. ఇప్పుడు ఈ రెండు నియోజకవర్గాల పరిస్థితిపై ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైతే నియోజకవర్గాల జిల్లా విభజన, నియోజకవర్గాల సరిహద్దుల మార్పునకు ఫుల్‌స్టాప్ పడుతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు గత నెలాఖరులో మంత్రుల కమిటీ జిల్లాలవారీగా పర్యటించి ప్రజలనుంచి అభిప్రాయాలు సేకరిస్తుందని ప్రభుత్వం ప్రకటించినా ఆ పర్యటన జరగలేదు. వారి రాకకోసం నియోజకవర్గాల్లోని అఖిలపక్షానికి చెందిన నేతలు ఎదురుచూపులు చూస్తున్నారు. జిల్లాల పునర్విభజన పరిస్థితులపై రాజకీయ పార్టీ నేతలు మరోసారి ఆందోళనకు సమాయత్తమయ్యే అవకాశం ఉంది.

అంతర్వేది పుణ్యక్షేత్రంలో ముగిసిన పవిత్రోత్సవాలు 5

భారతీయ సనాతన సంస్కృతికి..
వేదాలే మూలస్తంభాలు

- ఫణియజ్ఞేశ్వర సోమయాజులు ఘనాపాఠి
- వేదఘోషతో పులకించిన అమలాపురం

అమలాపురంటౌన్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): భారతీయ సనాతన సంస్కృతికి వేదాలే మూలస్తంభాలని టీటీడీ హయ్యర్ వేదిక్ స్టడీస్ ప్రాజెక్టు ఆఫీసర్ దువ్వూరి ఫణియజ్ఞేశ్వర సోమయాజులు ఘనాపాఠి అన్నారు. వేదధ్వనులన్నీ ఆధునిక సమాజంలో శాస్త్రీయంగా నిరూపితమయ్యాయన్నారు. శ్రీకోనసీమ వేద శాస్త్ర సన్మానసభ సోమయాజులు ఘనాపాఠి అధ్యక్షతన అమలాపురం సత్యసాయి కల్యాణ మండపంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా సోమయాజులు ఘనాపాఠి మాట్లాడుతూ వేదాలను పరిరక్షించి ప్రచారం చేయాల్సిన బాధ్యత ప్రతి భారతీయుని కర్తవ్యమన్నారు.వేదధ్వని ఎంతవరకు వ్యాపిస్తుందో అక్కడ వాతావరణ కాలుష్యంతోపాటు దోషాలు తొలగిపోతాయని ఆధునిక శాస్త్రవేత్తలు సైతం నిరూపించారన్నారు. దేశవ్యాప్తంగా వేదవిద్యను ప్రోత్సహించేందుకు టీటీడీ కృషిచేస్తోందని, వేదం అభ్యసించిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేదిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, టీటీడీ ఆధ్వర్యంలో 700 పోస్టులు భర్తీ చేసేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేసిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 3వేలమందికిపైగా వేద విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. లోక కల్యాణార్థమే వేదసభలు నిర్వహిస్తున్నామని, ఎక్కడ వేద స్వస్తి జరుగుతుందో అక్కడ సుభిక్షంగా ఉంటుందని కడియాల వేంకటసత్య సీతారామఘనాపాఠి అన్నారు. తొలుత అమలాపురం శ్రీచంద్రమౌళీశ్వర, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలు, శంకరమఠంల్లో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గుళ్లపల్లి ప్రభాకర ఫణిరాజా దంపతులు వామనపూజ నిర్వహించారు. అనంతరం వేదసభలో మహామహోపాధ్యాయ, శృంగేరీ ఆస్థాన విద్వాంసులు విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ సనాతన ధర్మం వేదాలపై ఆధారపడి ఉందన్నారు. విష్ణుభట్ల సుబ్రహ్మణ్యేశ్వరఘనాపాఠి, గుళ్లపల్లి విశ్వనాథఘనాపాఠి, విష్ణుభట్ల శ్రీకృష్ణఘనాపాఠి, హరిసీతారామమూర్తి సలక్షణఘనాపాఠి, వడ్లమాని ఘనాపాఠిలు అనేక అంశాలను వివరించారు. వేదాలు, ఉపనిషత్తుల సారాంశాలను తెలియచేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన 300మందికిపైగా వేదపురుషులతో వేదస్వస్తి నిర్వహించారు. వేద పండితులను సన్మాన సభ ద్వారా సత్కరించారు. ఉపాధ్యాయుల కాశీపతిసోమయాజులు, సన్మాన సభ కార్యదర్శి గుళ్లపల్లి వేంకటరామ్, శిష్టా భాస్కర్, కుమారశాస్త్రి,యేడిది సుబ్రహ్మణ్యం, మండలీక ఆదినారాయణ, పుత్సాకృష్ణకామేశ్వర్ పాల్గొన్నారు.



అమలాపురంలో కోనసీమ వేదశాస్త్ర సన్మాన సభలో మాట్లాడుతున్న సోమయాజులు ఘనాపాఠి

సేంద్రియ వ్యవసాయ విధానంతో రైతుకు లాభం: జేసీ

- ముమ్మిడివరంలో ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సహజసిద్ధ సేంద్రియ వ్యవసాయ విధానాలను అవలంబించి రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని జేసీ టి.నిషాంతి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరంలోని కోరమండల్ ఇంటర్నేషనల్ ఎరువుల దుకాణాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఎరువుల షాపు లైసెన్సు గడువు తేదీ, ఎరువుల లైసెన్సు, ఎరువుల ధరలు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ, స్టాకు రిజిస్టర్, ఈపాస్ మిషన్, ఎరువుల నిల్వలు తదితర అంశాలు రికార్డులను ఆమె పరిశీలించారు. యూరియా, ఇతర కాంప్లెక్సు ఎరువులు ఎక్కడా అనధికారికంగా నిల్వలు ఉంచరాదని, బ్లాక్ మార్కెట్‌కు తరలించరాదని, ఎమ్మార్పీకి మించి అధికంగా విక్రయించరాదని, ప్రతి రైతు బయోమెట్రిక్ సేకరించాలని ఆదేశించారు. యూరియాకు బదులు ప్రత్యామ్నాయంగా నానో ఎరువును వినియోగించాలన్నారు. తద్వారా పెట్టుబడిని తగ్గించుకోవచ్చునన్నారు. రైతు సాగు విస్తీర్ణానికి అనుగుణంగా మాత్రమే ఎరువుల సరఫరా చేయాలని, అంతకుమించి ఎరువులను రైతులకు అమ్మరాదని సూచించారు. స్థానిక ఎరువులతో ఆమె ఎరువుల సరఫరాపై చర్చించి సహజసిద్ధ వ్యవసాయ ప్రకృతి సేంద్రీయ విధానాలను వివరించి రైతులను ప్రోత్సహించి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని, భూమి చౌడు బారకుండా భూసారం కాపాడుకోవాలని సూచించారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఏడీ డి.గౌతమ్, వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్ కుమార్, తహశీల్దార్ టి.సుభాష్, సీఐ ఎం.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.



ఎరువుల షాపులో స్టాకు వివరాలు పరిశీలిస్తున్న జేసీ నిషాంతి

జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 60మంది ఎంపిక

- నేడు కలెక్టరేట్ గోదావరి భవన్‌లో అవార్డుల ప్రదానం

అమలాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శుక్రవారం జరగనున్న గురుపుజోత్సవ వేడుకల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 60మంది ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ గురువారం రాత్రి 9గంటలకు ప్రకటించింది. జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో ప్రాథమిక, హైస్కూల్ స్థాయిలో వివిధ సబ్జెక్టుల బోధనలో ఉత్తమలైనవారిని ఈ అవార్డులకు ఎంపిక చేశారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం ఆవరణలోఉన్న గోదావరిభవన్‌లో ఎంపికైన 60మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శుక్రవారం అవార్డులను ప్రదానం చేయనున్నారు.

జిల్లాలో ఉత్తమఉపాధ్యాయులుగా ఎంపికైన వారి వివరాలిలా ఉన్నాయి. నూటుకుర్తి వేణుగోపాలస్వామి(దేవగుప్తం), లంక రాణి(ఇందుపల్లి), డి.వెంకటేశ్వరరావు(కె.గంగవరం), కారుపూడి పల్లయ్యశర్మ(చింతనలంక), భమిడిపాటి బీఎస్ఆర్ రామకృష్ణ(సూర్యనగర్), ఎన్‌బీవీఎస్ఎస్ హనుమంతరావు(బట్టేలంక), బళ్లమెహర్ మూర్తి(ఇరుసుమండ), రేలంగి నాగకుమార్(మండపేట), ఎస్.ఆదినారాయణ(పసలపూడి), ఏఎల్ వరప్రసాద్(జడ్పీహెచ్ఎస్ ఇసుకపూడి), పుణ్యమంతుల అర్జునరావు(మాగం), వాడపల్లి సత్యసూర్యనారాయణమూర్తి(వీరవల్లిపాలెం), వి.రామప్రసాద్(చొల్లంగి), బొక్కా లక్ష్మీతులసీ(బి.అగ్రహారం), బీవీవీ సత్యనారాయణమూర్తి(ఏ.వేమవరం), కేసీహెచ్ఎల్‌జీ నరసింహరాజు(తొండవరం), మట్టా నాగరాజు(మామిడికుదురు), మేకా రామలక్ష్మి(మున్సిపల్ హైస్కూల్), గుబ్బల వరలక్ష్మినరసింహశ్రీనివాస్(నాగుల్లంక), ఇళ్ల రాంబాబు(పి.గన్నవరం), యాళ్ల వెంకటేశ్వరరావు(గోపాలపురం), జి.సీతాదేవి(సోమేశ్వరం), సంపర వేణుగోపాలసింగ్‌బాబు(వెదురుపాక), తాడి శ్రీనివాసమహేశ్వరరావు(రాజోలు), మహ్మద్ తహీర్‌పాషా(అంతర్వేదిపాలెం), ఎ.వెంకటేశ్వరరావు(ఐ.పోలవరం), గన్నవరపు అమ్మిరాజు(పి.గన్నవరం), దొమ్మేటి శ్రీరామకృష్ణ (పాశర్లపూడి), జీవీ సత్యనారాయణ(కేశనపల్లి), ఆకెళ్ల కృష్ణ(మూలపాలెం), కోనాల నాగరాణి(ఆలమూరు), గుబ్బల నాగేశ్వరరావు (బోడసకుర్రు), యనమదల యావమ్మ (అమలాపురం), సరాకుల గోపిరాజు(రావులచెరువు), గెద్దాడ అశోక్‌కుమార్(సమనస), చిక్కాల శ్యామలకుమారి(అంబాజీపేట),గుడపాటి మాణిక్యాలరావు(మెర్లపాలెం), కోటిపల్లి వీవీఎస్ ఆచార్యులు (కేశనకుర్రు), గుత్తుల వెంకటేశ్వర్లు (చెయ్యేరు), వాసా ధనమహాలక్ష్మి(నల్లూరు), గొలకోటి చింతారావు(రాయుడుపాలెం), యెలుగట్ల జయావతి(బోడిపాలెం), బత్తుల రామాబాయ్ (మొగలికుదురు), చోడే కృష్ణమూర్తి(కేశవరం), సబ్బతి సత్యకుమారి(సోమదేవరపాలెం), పెచ్చెట్టి సుబ్రహ్మణ్యేశ్వరి(మానేపల్లి), చప్పిడి నాగవెంకటేశ్వరరావు(గోపాలపురం), కోరుమిల్లి వెంకటరమణ(పాశర్లపూడి), అన్నమనీడి నారాయణరావు(తాటిపాక నెం.1), కొల్లు రమాసత్యనారాయణ(కొత్తలంక), కె.ధర్మారావు (భీమనపల్లి), బోదూరి వెంకటరమణ (పామర్రు), రాయుడు నాగవెంకట స్వర్ణ(చింతలమెరక), వి.వెంకట్రావు(చింతలూరు), పరమట విష్ణుప్రసాద్(జడ్పీహెచ్ఎస్ సూర్యనగర్), ఆకుల వెంకట సత్యప్రియ(పితానివారిపాలెం), యార్లగడ్డ భాస్కరశాస్త్రి(చింతపల్లి) ఎంపికయ్యారు. వీరికి అమలాపురంలో జరిగే కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

అమలాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యూరియా ఎరువులను పక్కదారి పట్టించి కృత్రిమ కొరత సృష్టిస్తే బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మహేష్‌కుమార్ గురువారం హెచ్చరించారు.కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్, సహకారశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. యూరియా సరఫరా, డిమాండ్ స్థితిగతులతోపాటు సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం నానో ఎరువుల ద్వారా ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించడంతోపాటు వచ్చే రబీపంట సాగుకు ప్లాన్ ఆఫ్ యాక్షన్‌పై కలెక్టర్ సమీక్షించారు. పీఏసీఎస్, ఆర్ఎస్కేల ఎరువులు పక్కాగా ఉండాలని, యూరియాను పక్కదారి పట్టిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఎరువుల సరఫరాపై ఫిర్యాదులు, సమాచారాన్ని అందించాలంటే కలెక్టరేట్‌లోని 08856-293104కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని సూచించారు. ఈ నెంబరును ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద ప్రదర్శించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబుమాట్లాడుతూ 3500 మెట్రిక్ టన్నుల యూరియా రానుందన్నారు. జేసీ టి.నిషాంతి,ఎస్పీ కృష్ణారావు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మైనార్టీ వర్గాలకు చెందిన వివిధ చేతి వృత్తులదారులకు ఆర్థికంగా చేయూతనిచ్చేదిశగా పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఉమ్మడి జిల్లా ఈడీ ఎం.సునీల్‌కుమార్ గురువారం తెలిపారు. కింద అర్హులైన మైనార్టీ, ముస్లీం, క్రిస్టియన్ అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు.


కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లెకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

బోధన.. విలక్షణంగా..

బోధన అంటే ఆశువుగా పాఠం చెప్పడమే అనే అర్థం మారిపోయింది. బట్టీపడితే ఈరోజు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారనుకోవడం భ్రమ. కష్టపడి చదవడం కాదు.. ఇష్టపడి చదవాలనే కాలమిది. పాఠ్యాంశాలను అర్థం చేసుకుని, తమదైన జ్ఞానాన్ని ఆపాదిస్తేనే విద్యకు సరైన పరమార్థం దక్కుతుంది. మరి ఆ మార్గంలో పయనించాలంటే గురువు చేసే దిశానిర్దేశమే కీలకం. అందుకే నేటితరం ఉపాధ్యాయులు బోధనలో కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు. ఏవిధంగా బోధిస్తే విద్యార్థులు అందిపుచ్చుకుంటారనే ఆలోచనతో నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నారు. అలాంటి వారిలో కొందరి గురించి..

కృత్యాధార బోధనే ఆయన ప్రత్యేకత

అనపర్తి ఉపాధ్యాయుడు శ్రీనివాస్ వినూత్న బోధన


చిన్నారులకు కృత్యాధార బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్

బోధన అంటే పుస్తకంలోని పాఠాలను పిల్లలకు నూరిపోసేయడమే అనే రోజులు పోయాయి. బట్టీపట్టి పాస్ అయితే పై తరగతులకు వెళ్లాక పల్టీ కొట్టడం ఖాయం. దీంతో ఉపాధ్యాయులు బోధించే విషయంలో అనేక వినూత్న పద్ధతులను అనుసరిస్తున్నారు. మరీ ముఖ్యంగా కొందరు ఉపాధ్యాయులు తమదైన శైలిలో బోధన చేస్తూ పాఠ్యాంశాల పట్ల ఎంతో ఆసక్తిని కలిగిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలోని మార్కెండేయపురంలోని మండల పరిషత్ పాఠశాలలో రెండో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు నీలా శ్రీనివాస్ వినూత్నంగా పాఠాలు బోధిస్తూ అటువంటి ప్రయత్నమే చేస్తున్నారు. అక్కడ పిల్లలు పాఠం వినడం కాదు.. ఆడుతూ పాడుతూ నేర్చుకుంటున్నారంటే అక్కడ బోధన స్పెషాలిటీ అర్థమవుతుంది. డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డు మీద గేమ్స్ ఆడుతూ లెక్కలు చెప్పడం, తెలుగు పదాలను వాక్యాలుగా మార్చడం, ఇంగ్లీషు అక్షరాలను ఓ పాట మాదిరిగా బోధించడం చేస్తున్నారు. 1998లో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన శ్రీనివాస్ కొత్త పద్ధతుల్లో బోధన చేసేందుకు నిరంతరం తపన పడతారు. దీనిలో భాగమే ఆట- పాట- మాట- కృత్యం. పిల్లలు ఒత్తిడి లేకుండా నేర్చుకోవాలి. పాఠశాల అంటే చిన్నారులకు ఆటస్థలం అనిపించాలి. అందుకే ఈ విధానాన్ని బోధనలో భాగం చేశానంటారు శ్రీనివాస్. ఆటలోనే పాఠం నేర్పడం, పాటల రూపంలో పదాలు, అక్షరాలు చెప్పించడం, మాటలతో చర్చలు, గ్రూప్ వర్క్ చేయించడం, కృత్యం ద్వారా పాఠాన్ని ఆచరణలోకి తీసుకురావడమే తన కర్తవ్యంగా శ్రీనివాస్ బోధిస్తారు. శ్రీనివాస్ అవలంబిస్తున్న విధానాలను తెలుసుకునేందుకు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విద్యాశాఖాధికారులు ఆయన పనిచేస్తున్న పాఠశాలను సందర్శించి అభినందిస్తుంటారు. **- ఆంధ్రజ్యోతి, అనపర్తి**

ఓ అధ్యాపకుడి చేయూత

ఏపీఎస్సీ హైస్కూల్ ప్లస్ అభివృద్ధికి పాల్‌రాజు ప్రత్యేక కృషి



తరగతి గదిలో విద్యాబోధన చేస్తున్న పాల్‌రాజు

గురువంటే విద్యాబోధన చేయడమే కాదు.. తాను పనిచేస్తున్న పాఠశాల అభివృద్ధికి ఆర్థిక చేయూత అందిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేవారూ ఉంటారు. కందుకూరి పాల్‌రాజు కూడా అలాంటి వారిలో ఒకరు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఏపీఎస్సీ హైస్కూల్ ప్లస్‌లో పాల్‌రాజు జువాలజీ అధ్యాపకునిగా విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నారు. ఈయన ఏ స్కూల్లో పనిచేసినా విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా సరళీకృతంగా పాఠాలు బోధించడం, ఆంగ్లంలో కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం చేస్తుంటారు. ఏపీఎస్సీ హైస్కూల్‌ని గతేడాది ప్రభుత్వం బాలికల హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియెట్ తరగతులు నిర్వహిస్తోంది. ఇంటర్ కోసం నిర్మించిన అదనపు తరగతుల భవనాలు, గోడలకు పెయింటింగ్స్ లేక విద్యార్థులు అసౌకర్యానికి గురవడాన్ని గుర్తించారు. రూ.30 వేల సొంత డబ్బులతో ఇంటర్ ప్రథమ, ద్వితీయ తరగతి గదులు, మీటింగ్ హాల్, బయట బాల్కనీ గోడలకు పెయింటింగ్స్ వేయించారు. ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం పేరెంట్స్ ఇళ్లకు వెళ్లి ఫస్టియర్‌లో ఈ ఏడాది 63 మంది విద్యార్థులు చేరేలా కృషిచేశారు. రెండేళ్లుగా కాలేజీలో అడ్మిషన్ల కోసం రూ.50 వేలు వెచ్చించి ఆటోల ద్వారా ప్రచారం చేయించారు. పాల్‌రాజు ఏమంటున్నారంటే.. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా పరిసరాల పరిశుభ్రత, ఆహ్లాద వాతావరణం, ఆసక్తి కలిగేలా బోధన చేస్తే వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి, మంచి ఫలితాలు సాధించవచ్చు.

- ఆంధ్రజ్యోతి, సర్పవరం జంక్షన్



ఎల్‌డీ పేట ప్రాథమిక పాఠశాలలో నాణేలతో బోధన చేస్తున్న అర్జునరావు మాస్టారు →

అణగనగా ఒక నాణెం..

పురాతన నాణేలతో పాఠం చెబుతూ..

అణా...పరకా.. బేడా ఇవేంటి అనుకొంటున్నారా.. ఇవి మనవాళ్లు వాడిన పురాతన నాణేలు. సుమారు నాలుగు దశాబ్దాల కిందట వరకు చలామణీలో ఉండేవి. ఈ పురాతన నాణేలను సేకరించిన కాకినాడ జిల్లా కోటనందూరు మండలం ఎల్‌డీ పేట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వాటితోనే బోధన చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఆయన పేరు పంచాడ అర్జునరావు. ఈ పాఠశాలలో అయన ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నారు. మన దేశంలో పూర్వం వాడిన నాణేలను సేకరించడం చాలామంది చేస్తుంటారు. అలాగే వివిధ దేశాల కరెన్సీని, గాంధీజయంతి నాడు ముద్రించిన ప్రత్యేక నోట్లను సేకరించడం మరికొందరి హాబీ. అర్జునరావు మాస్టారు 2002 నుంచి విద్యార్థులకు ద్రవ్యం గురించి పాఠాలు చెప్పడం కోసం నాణేల సేకరణ చేయడం ప్రారంభించారు. రెండు దశాబ్దాలకు పైగా కోటనందూరు, పాతకొట్టాం, కొత్తకొట్టాం, ఎల్‌డీపేట పాఠశాలల్లోని విద్యార్థులకు ఇలాంటి నాణేలతో బోధించడం అందరికీ సుపరిచితమే. పూర్వం నుంచి ఉన్న నాణేలతో ద్రవ్య చరిత్ర వివరించడం, పాత నోట్లు ఎలా చలామణీ అయ్యావో సవివరంగా తెలియజెప్పడం చేస్తుంటానని అర్జునరావు చెప్పారు.

- ఆంధ్రజ్యోతి, కోటనందూరు



మొక్కల సంరక్షణను వివరిస్తున్న టీచర్ విష్ణుప్రియ.. లెర్నింగ్ మెటీరియల్‌తో పాఠాలు బోధిస్తున్న దృశ్యం

'నేచురల్' స్టడీ

వినూత్న విద్యాబోధన ఆమె ప్రత్యేకత

లెర్నింగ్ మెటీరియల్‌తో పాఠాలు

పాఠశాల మైదానంలో జీవశాస్త్ర ప్రయోగాలు

విద్యార్థులకు వినూత్న రీతిలో పాఠాలు చెప్పేందుకు ప్రయత్నిస్తుంటారు కొందరు ఉపాధ్యాయులు. ఎలా చెబితే విద్యార్థుల బుర్రల్లోకి విషయం చేరుతుందో ఆ విధంగా విద్యా బోధన చేసేందుకు తపన పడుతుంటారు. కేవలం తరగతి గదిలో క్లాసులు చెప్పడమే కాదు.. పుస్తకాల్లోని అంశాలను ప్రాక్టికల్‌గా చేసి చూపడం కొందరి ఉపాధ్యాయుల ప్రత్యేకత.. అలాంటి వారిలో బొల్లు విష్ణుప్రియ కూడా ఒకరు. ప్రస్తుతం శ్రీనగర్ మున్సిపల్ హైస్కూల్లో (ఇంగ్లిష్ మీడియం) ఆమె ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు బయాలాజికల్ సైన్స్ సబ్జెక్టును బోధిస్తున్నారు. 15 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న విష్ణుప్రియ కాకినాడ రమణయ్యపేట, గొడారిగుంట మున్సిపల్ హైస్కూళ్లల్లోనూ పనిచేశారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తో పాఠాలు బోధిస్తూ- విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. జీవం, జీవుల శాస్త్రీయ అధ్యయనం, వాటి నిర్మాణం, పనితీరు, పెరుగుదల, మూలం, పరిణామం జీవావరణ శాస్త్రం, జంతు, వృక్ష, జీవ రసాయన శాస్త్రాలు, బయోటెక్నాలజీ, సూక్ష్మ జీవశాస్త్రం వంటి అనేక అంశాలను ప్రయోగాత్మకంగా చేసి చూపిస్తూ విద్యార్థులకు తరగతి గదిలోనే కాదు.. స్కూలు ఆవరణలోనూ పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. అంతేకాదు పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేస్తూ విద్యార్థులతో స్వయంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. వాటి సంరక్షణ బాధ్యతలను కూడా వారే చేపట్టేలా విద్యార్థుల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. తాను ఏ పాఠశాలలో పనిచేసినా బయాలాజికల్ సైన్స్‌లో విద్యార్థులు అధిక మార్కులు తెచ్చుకోవడంలో ఆమె కృషి చేస్తున్నారు. తరగతి గదిలో ఏ పాఠం చెప్పబోతున్నారో ఆ పాఠ్యాంశానికి సంబంధించిన లెర్నింగ్ మెటీరియల్‌ను ముందుగానే సిద్ధం చేసుకుని అందరికీ అర్థమయ్యే రీతిలో ప్రాక్టికల్‌గా విషయ పరిజ్ఞానాన్ని వివరించడం విష్ణుప్రియ ప్రత్యేకత.

- ఆంధ్రజ్యోతి, కాకినాడ




భట్లపాలెం ప్రాథమిక పాఠశాలలో కొడుకు మోహిత్‌సూర్య నోటు పుస్తకాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయుడైన తండ్రి నాగేంద్రగౌడ్.. రాజుపైరు పాఠశాలలో పిల్లలు కార్తీక, హారికలతో ఉపాధ్యాయుడైన తండ్రి సూర్యనారాయణ.. సత్యానందరావు, యజ్ఞకుమారి దంపతుల పిల్లలు శ్రీనందన, శ్రీనందకుమార్

ఆదర్శ ఉపాధ్యాయులు!

పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ..

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించుకుంటున్నారని విమర్శలు ఎన్నో ఉన్నాయి. అందుకు భిన్నంగా వీరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించారు. అమలాపురంరూరల్ మండలం ఇందుపల్లి శివారు భట్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొవ్విల వెంకట నాగేంద్రగౌడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తన కుమారుడైన శ్రీమోహిత్‌సూర్యను అదే పాఠశాలలో చేర్పించి ఐదో తరగతి విద్యార్థులతో కలిపి ఆయనే పాఠాలు చెబుతున్నారు. ఇక రాజుపైరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కుంచెం సూర్యనారాయణ ఉపాధ్యాయుడు. అదే పాఠశాలలో ఆయన పెద్ద కుమార్తె సత్యకృష్ణకార్తీక 4వ తరగతి, హారిక 2వ తరగతి చదువుతున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాల కావడంతో మిగిలిన పిల్లలతో కలిసి తన కుమార్తెలకు ఆయనే పాఠాలు చెబుతున్నారు. అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన బళ్ల సత్యానందరావు, ములికి యజ్ఞకుమారి దంపతులిద్దరూ ఉపాధ్యాయులే. యజ్ఞకుమారి ప్రస్తుతం రావులచెరువు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయిని. ఇక సత్యానందరావు తాను ఎనిమిదేళ్లపాటు బండారులంక వల్లూరివారిపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు. కుమార్తె లక్ష్మీవిశాల శ్రీనందన, కుమారుడు విజయ్‌శ్రీనందకుమార్‌లకు 5వ తరగతి వరకు తాను పనిచేసిన పాఠశాలలోనే చేర్పించి చదివించారు. అదే గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లలిద్దరు 8వ తరగతి చదివారు. వారిద్దరు ప్రస్తుతం పెద్దాపురం నవోదయ పాఠశాలలో చదువుకుంటున్నారు. **- ఆంధ్రజ్యోతి, అమలాపురం రూరల్**


గురుభ్యో నమః


డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పెయింటింగ్ చిత్రం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాం. ఆయన ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి రాష్ట్రపతిగా ఎంతో ఉన్నత స్థానానికి ఎదిగారు. దీనిలో భాగంగా పాలగుమ్మి జడ్పీ హైస్కూల్‌కు చెందిన చిత్రలేఖనం ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహచంద్ర కుమార్ తన అభిమానాన్ని చాటుకుంటూ వినూత్నంగా బ్లాక్ షీట్‌పై తెలుగు రంగు మాత్రమే ఉపయోగించి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని గీశారు. ఆ చిత్రం విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఆవగింజలతో సర్వేపల్లి చిత్రం

● 2025 గింజలను ఉపయోగించి తయారు చేసిన రాజారావు




రాజారావు, చిత్రకారుడు

ఆలమూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రాన్ని ఆవగింజలతో తయారుచేశారు. ఆలమూరు మండలం కొత్తూరు శ్రీవిద్యా పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యర్లగడ్డ రాజారావు మూడురోజుల పాటు శ్రమించి 2025 ఆవగింజలను ఉపయోగించారు. ఈయన అనేక మంది ప్రముఖుల చిత్రపటాలను తయారు చేయడంలో నేర్పరి. అతన్ని పలువురు అభినందించారు.

తెలుగు టీచర్ సృజన .. అక్షర రూపంలో

రాయవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీచర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని అక్షర రూపంలో గీసి రాయవరం మండలం వెదురుపాకకి చెందిన తెలుగు టీచర్ డాక్టర్ చిర్రా వెంకట మోహన్ అభిమానాన్ని చాటుకున్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాధాకృష్ణన్ జననం, బాల్యం, విద్యాభ్యాసం, పదవులు, పురస్కారాలు, బిరుదులు, తదితర అంశాలను ఈ చిత్రపటంలో పొందిపర్చానని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా నివాళి అర్పించినట్టు చెప్పారు.


అక్షర రూపంలో గీసిన చిత్రపటం

600 కిలోల గంజాయి పట్టివేత

తాళ్లపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలం మలకపల్లి వద్ద గురువారం 600 కిలోల గంజాయిను పోలీసులు పట్టుకున్నారు. విశాఖ జోనల్ యూనిట్ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులకు టీఎన్69 ఏఎం 4777 నెంబర్ గల ఇన్నోవా వాహనంలో గంజాయి వస్తుందనే సమాచారం అందడంతో వెంబడించారు. దీంతో కొవ్వూరు టోల్‌గేటు వద్దకు వచ్చేసరికి నిందితులు తప్పించుకుని పారిపోతుండగా మలకపల్లి వద్ద పోలీసులు అటకాయించారు. గంజాయిని తరలిస్తున్న వారిలో ఇద్దరు కారు దిగి పారిపోగా, పట్టుబడ్డ మహరాజన్ రాజాను విచారణ నిమిత్తం తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. కాగా, కారును పరిశీలించగా మొత్తం 292 గంజాయి ప్యాకెట్లు లభ్యమవగా, వాటి విలువ రూ. మూడు కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు గుర్తించారు. ఈ మేరకు నిందితుడ్ని, వాహనాన్ని రాజమహేంద్రవరం తరలించి, అక్కడ పూర్తి సమాచారం అందిస్తామని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు పేర్కొన్నారు.


తాళ్లపూడి పోలీస్ స్టేషన్ వద్ద గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

నారసింహా... పాహిమాం

● అంతర్వేది పుణ్యక్షేత్రంలో ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు
● స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు


ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో స్వయంభూగా వెలిసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో గత నాలుగు రోజులుగా స్వామివారి పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. పూర్ణాహుతితో స్వామివారి పవిత్రోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అభిషేకం, అలంకార తిరుమంజనం, ప్రాయశ్చిత హోమం, మహాశాంతి హోమం, పరమాత్మికోపనిషత్తు, శేష హోమం, 12 గంటలకు పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సాయంత్రం కంచు గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం గ్రామ పురవీధుల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. పవిత్ర అవరోహరణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పాలు, పవిత్రముల వినియోగం జరిగింది. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడడంతో అన్నదానంలో అధిక సంఖ్యలోభక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాజాబహుదూర్, ఆలయ ఏసీ ఎంకే టీఎస్వీ ప్రసాద్, అహోబిలం దేవస్థాన సభ్యులు, జంపన బుజ్జిరాజు, మధురాజు, చంటిరాజు, నల్లా ప్రసాద్, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, గొట్టుముక్కల భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పవిత్రాల అలంకరణలో స్వామి-అమ్మవార్లు


స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వీరికే..

దివాన్‌చెరువు, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ పీ.ఉమామహేశ్వరిదేవి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం తెలిపారు. దీనికి సంబంధించి ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో సీఎం నుంచి ఉమామహేశ్వరిదేవి అవార్డు అందుకుంటారని తెలిపారు. నన్నయలో ఆమె మేనేజ్‌మెంట్ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తూ విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్‌గా, ఉమెన్‌సెల్ కోఆర్డినేటర్‌గా సేవలందిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, విభాగాధిపతి ఆచార్య ఎస్.ఉదయభాస్కర్ తదితరులు ఉమామహేశ్వరీదేవికి అభినందనలు తెలిపారు.

ఇద్దరు పీఆర్ అధ్యాపకులకు..

కాకినాడరూరల్: కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల్లో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అధ్యాపకులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పురస్కారాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు తెలిపారు. కళాశాల కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన డాక్టర్ కె.లక్ష్మణ్, అదేవిధంగా భౌతికశాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ కె.జయదేవ్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారన్నారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగే గురుపూజోత్సవ వేడుకల్లో సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నుంచి అవార్డులను అందుకోనున్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమహేంద్రవరంలోని శ్రీ కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో సంస్కృత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పీ.శ్రీవల్లి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. రాజమండ్రి వాస్తవ్యురాలైన శ్రీవల్లి 2011 నుంచి సంస్కృత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ... ప్రస్తుతం కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అకడమిక్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. 2001లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంఏ సంస్కృతం పట్టా, 2009లో తిరుపతి ఆర్ఎస్ విద్యాపీఠం నుంచి సంస్కృతంలో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. విశాఖపట్నం ఆల్ ఇండియా రేడియో నుంచి విద్యార్థులకు సంస్కృతంలో తరగతులు నిర్వహిస్తున్నారు.

పవన్ ఉపాధ్యాయ దినోత్సవ కానుక

● రెండువేల మంది ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లకు చీరలు, ప్యాంట్లు, షర్టులు

పిఠాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన కానుకతో ఉపాధ్యాయలోకం మురిసిపోయింది. వివరాల్లోకి వెళితే.. పిఠాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న రెండు వేల మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు తన ఓఎస్‌డీలు, పేషీ అధికారుల ద్వారా పవన్ దుస్తులు పంపించారు. వీటిని విద్యార్థుల చేతులమీదుగా వారికి అందజేయించారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో గల అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, కళాశాలల్లోని అధ్యాపకులకు ఒకరోజు ముందే ఉపాధ్యాయ దినోత్సవం వచ్చినట్టయ్యింది. వీరందరికీ పవన్ ప్రత్యేకంగా కానుకలు పంపారు. గురువారం ఉదయమే డిప్యూటీ సీఎం పేషీ అధికారులు వీటిని తీసుకుని నియోజకవర్గానికి వచ్చారు. మహిళా ఉపాధ్యాయులకు చీరలు, పురుషులకు ప్యాంట్లు, షర్టులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పేషీ అధికారులు శివకుమార్, నాగబాబు, శ్రీనివాస్, గొల్లప్రోలు, పిఠాపురం ఎంఈవోలు వెంకట శివప్రసాద్, శ్యామ్‌బాబు, నారాయణదాసు, హెచ్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.


టీచర్లకు కానుకలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం పేషీ అధికారులు

గణేశుడి నిమజ్జనాల్లో ఘర్షణలు

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం బీ.కొత్తూరులో గురువారం జరిగిన వినాయక నిమజ్జనం ఘర్షణకు దారి తీసింది. బాణసంచా కాల్చే సమయంలో నిప్పు రవ్వలు కొందరిపై పడ్డాయి. దీంతో అదే సమయంలో అన్నదానం జరుగుతుండటం వల్ల ఇరువర్గాలు వాగ్వావాదానికి దిగాయి.అది చిలికిచిలికి గాలివానలా మారి తీవ్రమై ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో ఒక వర్గానికి చెందిన చెల్లి గణేష్, బాబీ, చంటమ్మకు, మరో వర్గానికి చెందిన చినబాబు, మాగాపు శ్రీనుకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పిఠాపురం, కాకినాడ ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. పిఠాపురం రూరల్ పోలీసులకు ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అల్లవరం: కొమరగిరిపట్నం గుర్రంవారి వీధి గణేష్ నిమజ్జన ఊరేగింపులో గురువారం రాత్రి అపశృతి చోటుచేసుకుంది. ఓ యువకుడు కత్తితో పొడవగా ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఉప్పలగుప్తం మండలం చీకట్లపాలేనికి చెందిన యువకుడు కత్తితో పొడవగా కొమరగిరిపట్నానికి చెందిన సుంకర రమేష్, కొమ్మూరి శంకర్ గాయపడినట్టు సమాచారం. విషయం తెలుసుకున్న అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ బి.సంపత్‌కుమార్ హుటాహుటిన వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఉద్రిక్త పరిస్థితుల నడుమ ఊరేగింపు అర్ధంతరంగా ఆగిపోయింది. సీఐ ఆదేశాల మేరకు కొమరగిరిపట్నంలో పోలీసు పికెట్‌ను ఏర్పాటుచేశారు.

రైస్ పుల్లింగ్ ముఠా గుట్టురట్టు

» కాకినాడలో పురాతన నాణేల పేరుతో ఘరానా మోసం
» ఐదుగురు నిందితుల అరెస్ట్
» నకిలీ ప్రాచీన నాణాలు, ప్లేటు, ధ్రువ పత్రాలు, రబ్బరు స్టాంపులు స్వాధీనం
» ఎస్పీ బిందుమాధవ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన కాలంనాటి అతి విలువైన, అరుదైన వస్తువులు, పురాతన అంతర్జాతీయ నాణాలు ఉన్నాయని వాటిని అమ్మితే బయట మార్కెట్‌లో ధర కోట్లలో ఉంటుందని అమాయక ప్రజలను నమ్మించి ధనార్జన చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను కాకినాడ టూటౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బుధవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా కాకినాడ, గాంధీనగర్ పార్క్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన షేక్ సర్దార్ అలియాస్ గుణ అలియాస్ గుణశేఖర్, అలియాస్ మహేశ్వరరెడ్డి, రామారావు పేటకు చెందిన పడాల వెంకటరమణ, విశాఖపట్నానికి చెందిన దువ్వు రాజశేఖర్, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన జమ్ము లక్ష్మీదుర్గ, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన కండవల్లి శ్రీనులుగా గుర్తించారు. ఈ ఐదుగురు మధ్యతరగతి చెందిన అమాయకులను ఎంచుకుని వారి వద్దకు వెళ్లి తమకు అమృత ట్రస్ట్ అనే అనాథ శరణాలయం ఉందని, దాని నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని, వాటిని పేద విద్యార్థులకు, వృద్ధులకు, రోగులకు, అనాథలకు అన్‌లైన్ అకౌంట్స్ తెరచి కొంత డబ్బును ప్రజలకు ఇస్తామని నమ్మించే వారు.అయితే ప్రాచీన, విలువైన, అరుదైన వస్తువులు తమ వద్ద ఉన్నాయని, వాటిని బహిరంగ మార్కెట్లో అమ్మితే కోట్లలో డబ్బులు వస్తాయని, వాటిని కొనుగోలు చేస్తే తక్కువ రేటుకు పురాతన వస్తువులు రావడంతో పాటు తమ ద్వారా పేదలకు, అనాథలకు సహాయం చేసిన వారవుతారని నమ్మించి సొమ్ములు కాజేసేవారు. అయితే వీరు ప్రాచీన నాణాలు, ప్లేట్లు నకిలీవి తయారు చేయించే వారు. వాటికి లేపనం చేసి నిజమైన వాటిగా రైస్ పుల్లింగ్ పరీక్షను, నీడిల్ పరీక్షను, ఉజాల పరీక్షను చేశారు. వాటిని అమ్మడానికి వారే పార్టీలను రప్పించే వారు.వారి వద్ద అమాయక ప్రజలతో కొనుగోలు చేయించి సొమ్ములు కాజేసేవారన్నారు.షేక్ సర్దార్ అమృత ట్రస్ట్ మేనేజర్‌గా, దువ్వు రాజశేఖర్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా, కండవల్లి శ్రీను సెకండ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా వ్యవహరిస్తూ తప్పుడు పత్రాలను సృష్టించి, వారి హోదాలకు సంబంధించి స్టాంప్స్‌ను తయారు చేసి ప్రజలను నమ్మించే వారు. ప్రజలకు ఆన్‌లైన్‌లో అకౌంట్స్ ఓపెన్ చేస్తామని ఒక్కో అకౌంట్‌కు రూ.13 వేలు వసూలు చేసి ట్రస్ట్ నుంచి కోట్ల రూపాయలు ఆ అకౌంట్స్‌లో పడతాయని చెప్పేవారు. వచ్చిన నగదును బ్యాగ్‌లలో భద్రపర్చి ఓ ఇంట్లో తాళం వేసి అమౌంట్ ప్రాసెసింగ్‌లో ఉందని నమ్మించి బ్యాగ్‌లు ఓపెన్ చేయనీయకుండా, అకౌంట్స్ ఇంకా ప్రాసెసింగ్‌లో ఉన్నాయని, కొంత డబ్బు అవసరమని నమ్మించి ప్రజల నుంచి నేరుగా జమ్ము లక్ష్మీదుర్గ అకౌంట్‌కు డబ్బులు వేయించుకుని మోసం చేసేవారు. నిందితుల వద్ద నుంచి 6 నకిలీ ప్రాచీన నాణాలు, ఒక నకిలీ ప్రాచీన ప్లేటు, 4 నకిలీ ధ్రువపత్రాలు, 2 నకిలీ రబ్బరు స్టాంపులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు, క్రైం సీఐ వి.కృష్ణ బృందాలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్పీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న నకిలీ వస్తువులు

ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా రమణ


జీవీ రమణను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాకా రమణగా సుప్రసిద్ధులైన, రాజమహేంద్రవరం ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్(రాకా) కార్యదర్శి జీవీ రమణ, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు 25మందితో పాలకవర్గ జాబితాను ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఇరిగేషన్ శాఖలో ఉద్యోగిగా పనిచేసి ఆ తరువాత రాకా సాంస్కృతిక సంస్థ స్థాపనలో కీలక పాత్ర వహించారు. అధ్యక్షుడిగా ప్రముఖ వైద్యుడు కంటే వీరన్నచౌదరి, తాను కార్యదర్శిగా పలు సాంస్కృతిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 1987 ఆకాశవాణి కేంద్రంలో డ్రామా ఆర్టిస్ట్‌గా ఎంపికై పలు రేడియో నాటికలు వేయడంతో పాటు రంగస్థలం మీద కూడా ఇండియా ఫర్ సేల్, దేశంలో దొంగలు పడ్డారు లాంటి పలు నాటికలు, సామాజిక స్పృహ కలిగిన రేడియో నాటికలు రాసారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో ఆయనకు ఉన్న అనుబంధం విడదీయరానిది. ఔత్సాహిక గాయకుడిగా పలు గీతాలు ఆలపించారు. 2019లో ధవళేశ్వరంలో పద్మశ్రీ ఘంటసాల విగ్రహ స్థాపనకు కృషి చేశారు. ఇటీవల ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేయించారు. స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని వీరన్నచౌదరి హాస్పిటల్ ఆవరణలోని బాలు స్మారక మందిరంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడుతూ నాటక అకాడమీ తరపున చేయాల్సిన కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సత్కరించారు. కార్యక్రమంలో తిరుమల కృష్ణమోహన్, సూరపరెడ్డి తాతారావు, భమిడిపాటి రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.

అద్దంపల్లి - యర్రపోతవరం రోడ్డులో దోపిడీ

వ్యక్తిని గాయపరచి బంగారం, నగదు, స్కూటీ పట్టుకుపోయిన దొంగలు

కె.గంగవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అద్దంపల్లి-యర్రపోతవరం రోడ్డు లో బుధవారం రాత్రి దోపిడీ జరిగిందని ఎస్.ఐ ఎస్‌కే జానీబాషా చెప్పారు. ద్రాక్షారామ గ్రామా నికి చెందిన దినేష్‌కు ద్రాక్షారామ, యానాంలో తాకట్టు, బంగారం విక్రయ దుకాణాలున్నాయి. అతడి వద్ద పనిచేసే యండమూరి శ్రీనివాసు యానాంలోని షాపును నిర్వహిస్తున్నాడు. శ్రీని వాసు ద్రాక్షారామ నుంచి రోజూ యానాం వెళ్లి వ్యాపారం చూసుకుని రాత్రి ఇంటికి తిరిగి వస్తుంటాడు. వచ్చేటప్పుడు యానాం షాపులో పనిచేస్తున్న అద్దంపల్లికి చెందిన విశ్వనాధం బుల్లియ్యను అద్దంపల్లిలో దింపి ద్రాక్షారామ వెళ తుంటాడు. ఈ క్రమంలో బుధవారం అద్దంపల్లి నుంచి యర్రపోతవరం వస్తుండగా ఆటోలో వ చ్చిన దుండగులు శ్రీనివాసును గాయపరచి 12 గ్రాముల బంగారం, రూ.5 వేలు రొక్కం, స్కూ టీ, పద్దుల పుస్తకాలు పట్టుకుని వెళ్లిపోయారు. దీనిపై శ్రీనివాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

వైవీ పాలెంలో యువకుడి ఆత్మహత్య


తోరం సాయి(ఫైల్)

పి.గన్నవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లో డబ్బును పోగొట్టి.. భయంతో 19 ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వైవీ పాలెంలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోరం శ్రీనివాసరావు జీవనోపాధి నిమిత్తం ఆటోను కొనేందుకు ఇంట్లో ఉన్న బంగారాన్ని ఈ నెల 1న స్థానిక ప్రైవేటు ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టారు. తాకట్టులో వచ్చిన రూ.1.25 లక్షల సొమ్మును తన కుమారుడు సాయి ఖాతాలోకి జమ చేయించాడు. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఉన్న సాయి తన ఖాతాలో ఉన్న సొమ్ము బెట్టింగ్‌లో పోగొట్టాడు. దీంతో తండ్రి మందలిస్తాడెమోనన్న భయంతో అదే రోజు మధ్యాహ్నం ఏటిగట్టుపైకి వెళ్లి పురుగులు మందు తాగేశాడు. చావు భయంతో బెట్టింగ్ విషయం, పురుగులు మందు తాగిన విషయం ఫోన్‌లో తన తండ్రికి, స్నేహితులకు వివరించాడు. దీంతో వారు హుటాహుటిన సాయి ఉన్న ప్రదేశానికి చేరుకుని తొలుత కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రావులపాలెం అక్కడ నుంచి అమలాపురం తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతుడు మేనమామ దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

రేపటి నుంచి అమెరికామెడీ నాటికలు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో కాకినాడ దంటు కళాక్షేత్రంలో అమెరికామెడీ నాటికలు ప్రదర్శించనున్నారు. అమెరికా హాస్యబ్రహ్మ వంగూరి చిట్టెన్ రాజు రచించిన ఐదు హాస్య నాటికల బ్రోచర్‌ను ప్రముఖ రచయిత, యూట్యూబర్ రవి మంత్రి గురువారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొంటున్న ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణికి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నట్టు వంగూరి ఫౌండేషన్ అధ్యక్షుడు చిట్టెన్ రాజు తెలిపారు. నాటక రంగ నిపుణులు ఆచార్య బీవీ రమణమూర్తి, ఆచార్య డీఎస్ఎన్ మూర్తిలకు ఆత్మీయ సత్కారం చేయనున్నట్టు దంటు భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో మార్ని జానకిరామచౌదరి, ప్రభుదాసు,కట్టా కృష్ణారావు, బాలాంత్రపు సుచిత్రామూర్తి పాల్గొన్నారు.

ట్రాక్టరు తిరగబడి కూలీ మృతి


ప్రమాదంలో మృతిచెందిన గోవిందు



ముమ్మిడివరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐరన్ ఊసల లోడుతో వెళుతున్న ట్రాక్టరు ట్రక్కు తిరగబడడంతో ఆ ట్రాక్టరుపై ఉన్న వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ముమ్మిడివరం మండలం అయినాపురం ఏటిగట్టుపై గురువారం జరిగింది. అయినాపురం ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం నుంచి మురమళ్ల ట్రాక్టరు ట్రక్కుపై ఇనుప ఊసలు తరలిస్తుండగా ట్రక్కుపై యానాం వెంకటన్‌నగర్ శివారు కురసంపేటకు చెందిన కూలీ మేడిశెట్టి గోవిందు (48) కూర్చొన్నాడు. ఏటిగట్టుపై వెళుతుండగా ట్రాక్టరుకు సడన్ బ్రేక్ వేయడంతో ట్రక్కు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ట్రక్కుపై ఉన్న గోవిందు కింద పడగా అతనిపై ఇనుప ఊచలు పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. కాగా గోవిందుకు భార్య రమాదేవి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గోవిందు కూలీ పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తుంటాడు. గోవిందు మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నాటు తుపాకీతో వ్యక్తి అరెస్ట్

గోకవరం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): నాటు తుపాకి కలిగి ఉన్న వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్టు గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. గోకవరం మండలం జగన్నాథపురం శివారున ఉన్న కోళ్ల ఫారమ్‌లో ఒక వ్యక్తి నాటు తుపాకీ కలిగి ఉన్నాడని తిరుమలాయపాలెం ఫారెస్ట్ సెక్షన్ అధికారి అమలదాసు భాస్కరకృష్ణ ఫిర్యాదు చేశారన్నారు. దర్యాప్తులో భాగంగా తుపాకీ కలిగిప యమల నాగబాబు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండు నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

వివాదాస్పద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు

అంబాజీపేట, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వివాదాస్పద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే చర్యలు తీసుకుంటామని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు హెచ్చరించారు. కులాలు, మతాలను రెచ్చగొట్టేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అటువంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన, డిజైన్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

వినాయక ఉద్వాసన కార్యక్రమం

కాట్రేనికోన, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన గేట్ సెంటర్‌లో గురువారం శ్రీవరసిద్ధివినాయక ఉద్వాసన కార్యక్రమం జరిగింది. ప్రముఖ పురోహితుడు ఆకొండి శంకరశాస్త్రిని ఉత్సవ కమిటీ, వర్తక సంఘం, గణేష్ యూత్ ఆధ్వర్యంలో సత్కరించారు. స్వామివారి పెద్ద లడ్డును రూ.24,500లకు గువ్వాల శ్రీనివాస్ దక్కించుకున్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం


అంతర్వేదిలో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుని విగ్రహం

ముమ్మిడివరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ముమ్మిడివరంలో శ్రీకృష్ణదేవరాయ మహిళా జూనియర్ కళాశాల, రావుబహుదూర్ రఘుపతి వెంకటరత్నంనాయుడు కళాశాల విద్యార్థినులు గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలో విద్యార్థినులు నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిలిపిన గణపతి ఉత్సవ విగ్రహాన్ని గురువారం నిమజ్జనం చేశారు. కళాశాల నుంచి ఊరేగింపుగా తీసుకువెళ్లి పంటకాల్వలో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గణేశుల బ్రహ్మానందం, గంధం శ్రీరామమూర్తి, జగతా సురేష్, జి.సతీష్, గుర్రం మహేష్, పచ్చిమాల శ్రీనివాస్, కె.నాగేంద్ర పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సఖినేటిపల్లి, టేకిశెట్టిపాలెం, అంతర్వేది, అంతర్వేదేవస్థానం, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు గ్రామాల్లో నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. అంతర్వది వేంకటేశ్వరస్వామి ఆలయం, రావివారిగూపులో వినాయకుని విగ్రహాలు తీన్మార్ డప్పులతో వశిష్టరేవులో నిమజ్జనం జరిపారు. గ్రామోత్సవాల అనంతరం నిమజ్జన కార్యక్రమాలు గణపతి మండలపాల నిర్వహణ కమిటీలు పోలీసు బందోబస్తు నడుమ జరిగాయి.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం మహాలక్ష్మి గుడిసెంటర్ గుర్రంవారివీధి గోడి కొత్తకాలనీ కొమరగిరిపట్నం మిల్టరీ కాలనీ, బెండమూర్లంక, తుమ్మలపల్లి గ్రామాల్లో గురువారం గణనాథుల విగ్రహాలతో ఊరేగింపులు నిర్వహించారు. చెడీ తాలింఖానా, బాణసంచా కాల్పుల నడుమ గణనాథుల భారీ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. గుర్రం వారి వీధిలో జనసేన నాయకుడు నల్లా రాము, గుర్రం శ్రీనివాస్, మానేపల్లి కార్తీక్‌ల ఆధ్వర్యంలో ఊరేగింపు శివాలయం వద్దకు చేరేసరికి ఓ యువకుడు కత్తితోదాడి చేయడంతో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మొగళ్లమూరిలో శెట్టిబలిజ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, గుబ్బల రాంప్రసాద్, లింగోలు పండు, ఆర్డీఎస్ ప్రసాద్, యాళ్ల నాగసతీష్, అల్లు సత్తిబాబు, పోలిశెట్టి బాబులు, సర్పంచ్ రాయుడు విష్ణు, యాళ్ల బిందాస్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. అల్లవరం ఎస్ఐ బి.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

బాబా ఉరుసు ఉత్సవాలు ప్రారంభం


కొత్తలంకలో తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం, బాబా దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

ముమ్మిడివరం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం కొత్తలంకలో శ్రీవలీ బాబా 78వ ఉరుసు ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశంనలుమూలల నుంచి అధిక సంఖ్యలో హిందూ, ముస్లింలు తరలివచ్చి వారివారి మతాచారాల ప్రకారం దర్గాను దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఉరుసు మహోత్సవాల్లో తొలిరోజు గంధం మహోత్సవాన్నినిర్వహించారు. ఫకీర్ల మేళతాళాలు, నౌబత్‌ఖానా వాయిద్యాలు, బ్యాండు మేళాలు, పొన్నూరివారి గుర్రపు నాట్యాలతో, బాణసంచా కాల్పుల మధ్య తెప్పలను నెత్తిమీద పెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. బాబా జీవించి ఉన్న కాలంలో ఉండే జెండా స్తంభం నుంచి ఊరేగింపు ప్రారంభించి అంకాలమ్మ చెరువు వరకు ఊరేగింపు నిర్వహించి చెరువులో తెప్పలు వదిలి పూజలు జరిపించారు. అనంతరంజెండాస్తంభం నుంచి బ్యాండు మేళాల వాయిద్యాలు, గుర్రపు నాట్యాలతో గంధాన్ని తీసుకువెళ్లి బాబాకు సమర్పించి అనంతరం భక్తులకు గంధాన్ని అందించారు. అధిక సంఖ్యలోభక్తులు తరలివచ్చారు. ముజావర్ గేదెల రఘునాథబాబా ఆధ్వర్యంలో ఈగంధం మహోత్సవంకార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులకు వసతి, మంచినీరు, భోజన వసతులు కల్పించారు. చినకొత్తలంక సర్పంచ్ కొత్తూరి ఉమారాణి, పీటీవీ వర్మ, పీఎస్ఎన్ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోత్తూరి సూర్యనారాయణరాజు, లచ్చాయమ్మ, ఆకాష్‌కుమార్‌వర్మ జ్ఞాపకార్థం భక్తులకు ఉచితంగా దమ్‌బిర్యానీ పంపిణీ చేశారు.

టీడీపీ జిల్లా అధ్యక్ష పదవి ఎస్సీలకు కేటాయించాలి


టీడీపీ ఎస్సీ నాయకుల సమావేశం

మలికిపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష పదవి ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించాలని పలువురు కోరారు. విశ్వేశ్వరాయపురంలో గెడ్డం సింహ ఇంటి వద్ద గోనిపాటి రాజు అధ్యక్షతన సమావేశం కోరింది. ఈసందర్భంగా పలువురు మాట్లాడారు. జిల్లాలో అత్యధిక భాగం ఎస్సీలు ఉన్నారని, ఏడు నియోజకవర్గాల్లో జనాభా దృష్ట్యా మూడు నియోజకవర్గాలు ఎస్సీ స్థానాలుగా కేటాయించడం జరిగిందన్నారు. పార్టీ పదవుల్లో కూడా ఎస్సీ సామాజిక వర్గానికి తగిన గుర్తింపు ఇవ్వాలని తద్వారా ఎస్సీలు టీడీపీని బలోపేతం చేయడానికి తోడ్పడుతుందన్నారు. అంబేడ్కర్ ఆశయాలను చంద్రన్న ఆచరణ ద్వారా నెరవేరాలని, దళిత తేజం తెలుగుదేశం స్ఫూర్తిని ఎస్సీ సామాజికవర్గంలో మరోసారి నింపాలని కోరారు. సమావేశంలో గోనిపాటి రాజు, గెడ్డం సింహ, రాపాక నవరత్నం, ఉండ్రాజవరపు బాబూరావు, కేవీ రమణ, ఉండ్రు రామకృష్ణలతో పాటు అధిక సంఖ్యలో ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టింగులు పెడితే చర్యలు: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టింగులు పెడితే చర్యలు తప్పవని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు హెచ్చరించారు. కొన్ని నెలలుగా అమలాపురంలోని ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసే విధంగా కొందరు వ్యక్తులు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్లెక్సీలపై ఇతర వర్గాలు, కులాల వారిని రెచ్చగొట్టేవిధంగా ఏ ఒక్కరూ పోస్టింగులు పెట్టరాదన్నారు. టీడీపీ ఎప్పుడు అధికారంలో ఉన్నా ప్రశాంతవాతావరణం ఉంటుందన్నారు. చట్టం ముందు అందరూ సమేనమేనని, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, నాయకులు ఆశెట్టి ఆదిబాబు, బోనం సత్యవరప్రసాద్, తిక్కిరెడ్డి నేతాజీ, అబ్బిరెడ్డి చంటి, పెద్దిరెడ్డిసాయిపుల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభానికి సన్నాహాలు



మలికిపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుడిమూలలో రూ.3.70కోట్లతో ఏర్పాటుచేసిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఈనెల8న ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన ఇంటి వద్ద విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షించారు. ఈసబ్‌స్టేషన్ ఏర్పాటుద్వారా సఖినేటిపల్లి మండలంలో పలు గ్రామాలకు మేలు జరుగుతుందన్నారు. ఏర్పాటు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. సమీక్షలో విద్యుత్ శాఖ ఏడీఈ బీవీ కృష్ణరాజా, ఏఈ బి.ప్రసాద్, గుండుబోగుల పెదకాపు, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, సబ్బతిశ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

అల్లవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేవగుప్తం పంచాయతీ పెదాంధ్రపేటలో గురువారం రాత్రి 63కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశామని ఏఈ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా బుధవారం రాత్రి గ్రామస్తులు ఆందోళన చేపట్టిన సంగతి విదితమే. విద్యుత్ సమస్య తలెత్తకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. ఏఈకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వరదల తర్వాత అప్పనపల్లి కాజ్‌వే వంతెన పనులు ప్రారంభం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరదల అనంతరం అప్పనపల్లి కాజ్‌వేపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభించన్నుట్టు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.14.50కోట్లు మంజూరయ్యాయని, ఈ పనులు త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. పెదపట్నంలంక ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.1.10 కోట్లు ప్రతిపాదనలు పంపించామని, వీటికి త్వరలో ఆమోదం లభిస్తే పనులు ప్రారంభిస్తామన్నారు.పెదపట్నం నుంచి రత్నాపురం రోడ్డుకు రూ.50లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. లంక గ్రామాల ప్రజల చిరకాల వాంఛ అయిన అప్పనపల్లి కాజ్‌వేపై వంతెన నిర్మాణం కూటమి ప్రభుత్వ హయాంలో పూర్తవుతుందన్నారు. దీనికి నిధులు మంజూరుచేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజాకుమారి, జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, ఎంపీడీవో జి.భవానీ, డిప్యూటీ తహశీల్దార్ శరణ్య, అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి


లబ్ధిదారుడికి సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్ర బాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు పేదల పక్షపాతిగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం నియోజకవర్గ జనసేన క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకర్గం నాలుగు మండలాలకు చెందిన 110మందికి రూ.67.02 లక్షలు విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు సీఎం సహాయనిధి ద్వారా 19సార్లు 459మందికి రూ.3.30కోట్లు లబ్ధిదారులకు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఏఎంసీ చైర్మన్లు పెనుమాల లక్ష్మి, చిట్టూరి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, దాసరి వీరవెంకటసత్యనారాయణ, బొండాడ నాగమణి, నాగాబత్తుల శాంత కుమారి, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, శేరు శ్రీనుబాబు, బొరుసు సత్యనారాయణ, మద్దుల అనూరాజేశ్వరి పాల్గొన్నారు.

రూ.7లక్షలు వచ్చాయి: గుత్తుల కృష్ణవేణి

ఏప్రిల్ నెలలో బెంగళూరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫార్మ్‌పై ఉన్న నేను రైలు ప్రమాదానికి గురయ్యాను. ఎనిమిది చోట్ల ఎముకులు విరిగిపోయాయి. మూడుసార్లు ఆపరేషన్లు చేశారు. రూ.16లక్షలు ఖర్చయింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ద్వారా ప్రభుత్వానికి బిల్లులు పంపించడంతో రూ.7లక్షలు మంజూరైంది. ఆ చెక్కును ఆమెకు ఎమ్మెల్యే అందించారు.

ఎంపీటీసీల డిమాండ్లు పరిష్కరించాలి


ఆందోళన చేస్తున్న ఎంపీటీసీలు

మామిడికుదురు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీల డిమాండ్లు పరిష్కరించాలంటూ వారు గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలియచేశారు. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన వేతనపు పెంపు హామీని వెంటనే అమలు చేయాలని, జనాభాప్రాతిపదికన గ్రామాలకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్‌చేస్తూ ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు, ఎంపీపీ కె.వనజాకుమారికి అందించారు. ఎంపీటీసీ సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్,ఎంపీటీసీలు జాలెం అనూష, నయినాల సీతామహాలక్ష్మి, వర్ధినేని రాము, అంకాని వీరాంజనేయులు, గెడ్డం మహలక్ష్మి, మల్లాడి వడ్డికాసులు, కొప్పిశెట్టి దుర్గాపార్వతీదేవి పాల్గొన్నారు.

అగ్రికల్చర్ మిషన్ డైరెక్టర్‌గా ఉమామహేశ్వరరావు



అమలాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ డైరెక్టర్‌గా జనసేన పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు అయితాబత్తుల ఉమామహేశ్వరరావును నియమిస్తూ సీఎం చంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. రైతు సంఘ నాయకుడిగా గ్రామస్థాయి నుంచి మంచి పట్టు ఉన్న ఉమామహేశ్వరరావును డైరెక్టర్‌గా నియమించడం పట్ల పలువురు నేతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత విద్యాభ్యాసంచేసిన ఉమామహేశ్వరరావు ఉప్పలగుప్తం మండలం గోకవరానికి చెందిన జనసేన నాయకుడు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జనసేన, టీడీపీ నాయకులు ఆయన్ను అభినందనలతో ముంచెత్తి, శాలువాలతో సన్మానిస్తున్నారు. ఈపదవి రావడంలో కృషిచేసిన సీఎం చంద్రాబు, జనసేన అధినేత, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులతో పాటు వివిధ పార్టీల నాయకులకు ఉమామహేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గణనాథుల లడ్డూలకు వేలం

మామిడికుదురు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన లడ్డూలు వేలంలో అత్యధిక ధర పలికాయి. మొగలికుదురు జిన్నూరినగర్‌లో వినాయక మందిరాన్ని రూ.లక్ష నగదులో అలంకరించారు. ఈ మండపంలో వినాయకుడికి సమర్పించిన తొమ్మిదిన్నర కిలోల లడ్డూను అదే గ్రామానికి చెందిన జున్నూరి రాజేష్ రూ.54,500కు వేలంటపాలో దక్కించుకున్నాడు. మాకనపాలెంలో చెల్లింగివారి గ్రూపులో జరిగిన వేలంపాటలో స్థానిక మహిళలు రూ.31,300కు పాడి దక్కించుకున్నారు. ఈసందర్భంగా మొగలికుదురులో జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం హైస్కూలు సెంటర్‌లోని లక్ష్మీగణపతికి జగతా రమణ 30కిలోల లడ్డూను కానుకగా సమర్పించగా గురువారం ఆలయ కమిటీ వేలం పాట నిర్వహించింది. జగతా నాగబాబు రూ.50వేలకు ఆ లడ్డూను దక్కించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నాగబాబును దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో చోడపనీడి బాలకృష్ణ, సురవపు బాబూరావు, కొప్పిశెట్టి రమేష్, సుంకర గంగ, యల్లమిల్లి పెద్ద, బసవా ఏడుకొండలు, తాడాల తాతాజీ, జగతా ప్రకాష్, నూకల రాము పాల్గొన్నారు. అలాగే లంక తల్లెమ్మగుడి వద్ద గొల్లవీధిలోను గురువారం లడ్డూలకు వేలం నిర్వహించగా మానసాని కృష్ణ, కృష్ణతేజ సోదరులు రూ.8100కు సొంతం చేసుకున్నారు. లంక తల్లెమ్మగుడి వద్ద వేలం నిర్వహించగా బొక్కా రమేష్ రూ.7,800కు సొంతం చేసుకున్నారు. ఆలయ అర్చకుడు ధోనేపూడి రాజేష్‌ను సత్కరించారు. ఈసందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. వస్త్రాల వీరన్న, కూరాకుల శ్రీనివాస్, అజయ్‌కుమార్, జగతా శివ, చెల్లూరి దుర్గాప్రసాద్, పి.శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనాలు

అంబాజీపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయాలు, గణపతి పందిళ్ల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. తొలుత మేళతాళ మంగళవాయిద్యాలతో, బాణసంచా కాల్పులతో స్వామివారిని ఊరేగింపు నిర్వహించి స్వామివారిని నిమజ్జనంచేశారు.స్వామివార్లను పలువురు నాయకులు దర్శించుకున్నారు.

9న 5కే రన్ పోటీలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈనెల9న జిల్లాస్థాయి మారథాన్ 5కే ఉన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారిణి డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి తెలిపారు. జిల్లా క్రీడాధికారి సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలో 17నుంచి 25ఏళ్ల మధ్య వయసు గలవిద్యార్థినీ విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొనవచ్చన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. మొదటిస్థానానికి రూ.10వేలు, రెండో స్థానానికి రూ.7వేలు బహుమతులు ఇస్తామన్నారు. స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా 5 కిలోమీటర్ల రన్ ఉంటుందన్నారు. క్లినికల్ సర్వీసెస్ అధికారి ఎ.బుజ్జిబాబు, సెల్ 9000397803ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

గణనాథుడికి గరిక పూజ

ఐ.పోలవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీ సమేతవీరేశ్వరస్వామి ఆలయంలో కొలువుతీరిన గణపతికి గురువారం గరిక పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పేటేటి శ్యామలకుమార్, యనమండ్ర సుబ్బారావు, పురోహితుడు నాగభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం దూర్వార్చన నిర్వహించారు. స్వామిని వివిధ ఫలాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు వేద ఆశీర్వచనం అందించారు. సహాయ కమీషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు. వేద పండితులు గంటి సుబ్రహ్మణ్యం, నాగభట్ల రవిప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఐ.పోలవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని గుత్తెనదీవి సాయిరాం విద్యానికేతన్ కరస్పాండెంట్ సలాది శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయిరాం విద్యానికేతన్‌లో గురుపూజోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గురువులను సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాగాపు సీతారత్నం, బొమ్మిడి నాగేంద్రవర్మ, నాటి ధనరాజు, గల్లా భూలక్ష్మి, నల్ల దేవకి, కొంకి నాగజ్యోతి, దేవరపల్లి దుర్గ, పోతుల లతామంగేష్కర్, దుగ్గదుర్తి వీరలక్ష్మీ, గంజా లోవలక్ష్మి, ఎ.ప్రత్యూష, ఎ.శిరీష, ఓలేటి అమ్మాజీ, కట్టుంగి నాగదివ్య, నల్ల విజయదుర్గ, జగతా రత్నమాలతి, డి.శ్రీపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలి: డీఎస్పీ

రాజోలు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజోలులో ఈనెల6న ఆంజనేయ ఘాట్ వద్ద జరగనున్న నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్ సూచించారు. రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ అధ్యక్షతన రాజోలు సర్కిల్ పోలీసుస్టేషన్ కార్యాలయ ఆవరణలో వివిధ గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమం విజయవంతానికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రాజోలు తాలూకా గణేష్ నిమజ్జన ఉత్సవ సమితి అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

డీటీ ఫలితాల విడుదల

యానాం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహశీల్దార్(డీటీ) 30పోస్టులకు సంబంధించిన గతనెల31 రాష్ట్రవ్యాప్తంగా రాత పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. గురువారం ఫలితాలు విడుదలయ్యాయి. యానాం నుంచి జువ్వల బాలశ్రీ ఎంపికైంది.

ఎయిడ్స్‌పై అవగాహన

ముమ్మిడివరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ యూత్‌డే పురస్కరించుకుని ముమ్మిడివరంలోని డాక్టర్ మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముమ్మిడివరం కమ్యూనిటీహెల్త్ సెంటర్, ఐసీటీసీ పర్యవేక్షణలో రెడ్ రిబ్బన్ క్లబ్, చేంజెస్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు హెచ్ఐవీ, ఎయిడ్స్, మాదక ద్రవ్యాల వినియోగంపై కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ పీఎల్ ప్రశాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రశాంతి, అధ్యాపకులు కె.శ్రీనివాసరావు, యు.కిరణ్‌కుమార్, చేంజెస్ సంస్థ ప్రతినిధులు ఎం.దుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

'నిధుల్లేకుండా పనులెలా జరుగుతాయి'

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లకు, కార్యదర్శులకు పనుల నిర్వహణపై ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారే తప్ప నిధుల్లేకుండా పనులెలా జరుగుతాయని సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో భూపతిరాజు తులసీకృష్ణ అధ్యక్షతన పంచాయతీ అభివృద్ధి సూచికపై అవగాహన కార్యక్రమం జరిగింది. చెత్తతొలగించేందుకు కార్యదర్శులు సొమ్ములేక నానా పాట్లు పడుతుంటే, ఉన్నతాధికారులు మెమోలు జారీచేయడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామపంచాయతీలకు పారిశుధ్యం, తాగునీటి సరఫరాకునిధులు విడుదల చేస్తే గ్రామాలఅభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామాల అభివృద్ధిలో పాటించాల్సిన ప్రధానసూత్రాలపై ఈకార్యక్రమంలో వివరించారు.గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త, తాగునీటిసరఫరాలో అడ్డంకులపై ఎంపీటీసీలుఆందోళనవ్యక్తంచేశారు.

నాటక అకాడమీ డైరెక్టర్‌గా పద్మ



మలికిపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దిండి మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్లమెంటరీ అధికార ప్రతినిధి బందెల పద్మను రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. నియోజకవర్గంలో పలువురు పద్మ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పద్మకు అభినందన: నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన దిండి మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకురాలు బందెల పద్మను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దుశ్శాలువా కప్పి అభినందించారు. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా పద్మ కలిశారు. ఈసందర్భంగా పద్మ ఎమ్మెల్యే దేవను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సెంట్రల్ డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, అడబాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రూ.65వేలు రికవరీ

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): డ్వామా పీడీ మధుసూదన్ అధ్యక్షతన గురువారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం 18వ విడత ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ 2024-2025 సంవత్సరానికి సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికను నిర్వహించారు. ఏడాదిలో 17గ్రామాల పరిధిలో రూ.16 కోట్లతో జరిగిన 1750పనులకు గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహించి గ్రామ సభల ద్వారా ప్రజలకు తెలియజేశామని ఎస్ఆర్పీ పి.సింహాద్రి ప్రజావేదికలో తెలిపారు. ఆడిట్ వివరాలను ప్రజావేదికలో చదివి విన్పించారు. ఈసందర్భంగా రూ.65,000 రికవరీ చేసినట్టు పీడీ తెలిపారు. సిబ్బందికి రూ.5,000లు జరిమానా విధించామన్నారు. డ్వామా ఏపీడీ డి.రాంబాబు, విజిలెన్స్ అధికారి సత్యనారాయణ, అంబుడ్స్‌మెన్ ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీవో భూపతిరాజు తులసీకృష్ణ, ఎస్టీఎమ్ కె.సత్యనారాయణ, ఏపీవో పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను బహూకరించిన భూపతిరాజు

అంతర్వేది, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ (ఐఎస్‌సీ), యూఎస్‌ఏ ఫౌండర్, చైర్మన్ పండేటి భూపతిరాజు సహకారంతో కూలింగ్ వాటర్ డిస్పెన్సర్‌ను బహూకరించారు. ఈవాటర్ ప్లాంటును చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ ఏసీ ఎంకేటీ న్వీ ప్రసాద్ గురువారం ప్రారంభించారు. ముందుగా అర్చకులు వాటర్ ప్లాంట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ జంపన బుజ్జిరాజు, సంస్థ ప్రతినిధులు, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు, మధురాజు, చంటిరాజు, మూలాస్వామి పాల్గొన్నారు.

ఆర్ఏగా అంకిత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



యానాం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యానాం నూతన పరిపాలనాధికారిగా 2023 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అంకిత్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మునిస్వామితో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. పుదుచ్చేరి సమాచారశాక డైరెక్టర్‌గా బదిలీపై వెళుతున్న మునిస్వామికి అధికారులు, సిబ్బంది వీడ్కోలు పలికారు.

సీఎం హామీతో ఆందోళన విరమణ

యానాం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి హామీతో పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ సిబ్బంది గురువారం సాయంత్రం ఆందోళన విరమించారు. డిమాండ్లు పరిష్కరించాలని మున్సిపల్ సిబ్బంది కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సీఎం, స్వపరిపాలనశాఖ కార్యదర్శి, డైరెక్టర్‌తో మున్సిపల్ సిబ్బంది సమస్యలపై చర్చించి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీంతో సమస్యల పరిష్కారానికి సీఎం హామీఇవ్వడంతో ఉద్యోగులు ఆందోళన విరమించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలి

మామిడికుదురు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తుందని, వాటిని వినియోగించుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. మండలంలోని 23 డ్వాక్రా సంఘాలకు విడుదలైన రివాల్వింగ్ ఫండ్ చెక్కు రూ.2.30లక్షల చెక్కును ఎమ్మెల్యే గురువారం పంపిణీ చేశారు. ఎంపీపీ కె.వనజాకుమారి, జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, డీఆర్డీఏ ఏపీఎం విప్పర్తి వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రణాళికతో పంచాయతీలు పురోభివృద్ధి సాధించాలి

పి.గన్నవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పురోభివృద్ధిని ఒక ప్రణాళిక పద్ధతిలో సాధించాలని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇన్‌చార్జి ఎంపీడీవో జి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రగతి యాప్ ద్వారా 2023-24లో పంచాయతీల్లో 24శాఖలకు సంబంధించి జరిగిన అభివృద్ధిని నమోదు చెయ్యాలన్నారు. అనంతరం పంచాయతీలకు జాతీయ స్థాయిలో అవార్డులు లభిస్తాయన్నారు. అనంతరం యాప్‌లో వివరాలు ఏవిధంగా నమోదు చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో పుష్ప రాజ్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి వితరణ

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్.కొత్తపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థి తెలుగుదేశం నాయకుడు దోనిపాటి అశోక్ పాఠశాలకు రూ.25 వేలు విరాళాన్ని గురువారం హెచ్ఎం టి.రాజేశ్వరికి అందించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుగు లంకే శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మల్లాడి వెంకటరమణ, పీఎంసీ చైర్మన్ లంకే సూర్యవర్మ, అచ్చెయ్యగారి శ్రీను, దోనిపాటి వరప్రసాద్ పాల్గొన్నారు.

లీగల్ సర్వీస్ సెల్ అధ్యక్షుడిగా అఖిలేష్‌రెడ్డి

ముమ్మిడివరం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గ వైసీపీ పార్టీ లీగల్‌సెల్ అధ్యక్షుడిగా కోన వెంకటఅఖిలేష్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అభివృద్ధికి పాటు పడతానన్నారు. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, పెన్మెత్స చిట్టిరాజులకు ఆయన కృజ్ఞతలు తెలిపారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): హైదరబాద్‌కుచెందిన కందుకూరి ప్రభాకరరావు కుటుంబ సమేతంగా గురువారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

అయినవిల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నేదునూరులో రైతులకు డ్రోన్ల పనితీరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. పి.రఘురాజుకు చెందిన వరి పొలానికి మీనామృతం ఎలా పిచికారీ చేయాలో క్షేత్రస్థాయిలో వివరించారు. అయినవిల్లి ఏవో శోభ, ఏపీసీఎంఎఫ్ సిబ్బంది పాల్గొని రసాయన రహిత ప్రకృతి సాగువైపు రైతులు మళ్లాలన్నారు. సూరిబాబు, జగదీశ్వర్, ఏడుకొండలు, దుర్గాభవానీ, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రులో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

డీసీసీ అధికార ప్రతినిధిగా కిరణ్‌కుమార్



కాట్రేనికోన, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): డీసీసీ అధికార ప్రతినిధిగా కంచుస్తంభం కిరణ్‌కుమార్(సోనీ)ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాంగ్రెస్ పార్టీకి వైభవం తెచ్చేలా కృషి చేస్తానని సోనీ అన్నారు. ఆయన తొలుత ప్రజారాజ్యంలో, అనంతరం చిరంజీవి వెంట కాంగ్రెస్‌లో చేరారు.

పంచాయతీల పురోభివృద్ధిపై శిక్షణ

అంబాజీపేట, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన పంచాయతీల పురోభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఏవీఎల్ నరసింహం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, పంచాయతీలపురోభివృద్ధిపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వస్తువులు వినియోగాన్ని తగ్గించేలా ప్రజాప్రతినిధులు సహకరించాలని డిప్యూటీ ఎంపీ డీవో కె.శ్రీనివాస్ కోరారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్యాంక్ కెనాల్‌లో గుర్రపుడెక్క తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్రేయపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ డెల్టా పరిధిలోని ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్‌లో పూడుకుపోయి న గుర్రపుడెక్క, తూడు, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టారు. ఇటీవల కాలువల ఆధునికీకరణ ఏదీ అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ స్పందించి ఆ దిశ గా కాలువల పూడిక పనులు నిర్వహించేందుకు నిధులు మంజూరు చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్ ద్వారా శివారు ప్రాంత రైతుల సాగునీటి ఇబ్బందులను సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు పర్యవేక్షణలో చర్య లు చేపట్టారు. చెత్తా చెదారాలతో నిండిపోయిన గుర్రపుడెక్క, తూడును తొలగింపు చేపట్టారు. సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఈ చర్యలు చేపట్టి కాలువకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో శివారు ప్రాంతాలకు సాగునీరు సమృద్ధిగా ప్రవహిస్తున్నది.


బ్యాంక్ కెనాల్ కాలువలో గుర్రపుడెక్కను తొలగిస్తున్న దృశ్యం

రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో కలపాలి

మంత్రివర్గ ఉపసంఘానికి అఖిలపక్ష జేఏసీ వినతి

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని అఖిలపక్ష జేఏసీ నాయకులు గురువారం మంత్రివర్గ ఉప సంఘానికి వినతిపత్రాలు అందచేశారు. అమరావతి సచివాలయంలో మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు, మంత్రులు అనగాని సత్య ప్రసాద్, బి.సి.జనార్ధనరెడ్డిలను అఖిలపక్ష జేఏసీ నాయకులు మాగాపు అమ్మిరాజు, బి.సిద్దూ, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దొమ్మలపాటి సత్యనారాయణ, పీవైఎల్ నాయకుడు వానపల్లి నాగరాజులు కలిశారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని అందుకుగల కారణాలు కూలంకషంగా వివరించారు. అం తకు ముందు మంత్రి సుభాష్‌కు జేఏసీ నాయకులు రామచంద్రపురాన్ని కాకినాడలో కలపాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు.


మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ సభ్యులు

నాటక అకాడమీ డైరెక్టర్‌గా అన్నపూర్ణ

రామచంద్రపురం(ద్రాక్షారామ),సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాటక అకాడమీ రాష్ట్ర డైరెక్టరుగా ద్రాక్షారామకు చెందిన పెంకె అన్నపూర్ణ నియమితులయ్యారు. ద్రాక్షారామకు చెందిన అన్నపూర్ణ గత స్థానిక ఎన్నికల్లో కె.గంగవరం జడ్పీటీసీ సభ్యురాలిగా టీడీపీ తరపున పోటీ చేశారు. ఆమె భర్త సాంబశివరావు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తున్నారు. నాటక అకాడమీ డైరెక్టరుగా నియమితులైన ఆమె గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి సుభాష్ తండ్రి, టీడీపీ నాయకుడు వాసంశెట్టి సత్యంను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ దడాల నాగార్జున, కూటమి నాయకులు ఆమెను అభినందించారు.


అన్నపూర్ణను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

'ఎమ్మెల్యే జయరామ్‌ను పదవి నుంచి తొలగించాలి'

కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన

మండపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జయరామ్‌ను తక్షణమే ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకర రావు డిమాండ్ చేశారు. బుధవారం అనంత పురం జిల్లా గుత్తి మండ లం బేతపల్లి గ్రామ ంలో సోలార్ ప్లాంట్ కోసం సేకరించిన భూముల పరిశీలన కోసం వెళ్లిన ఏపీ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డిని ఫోన్‌లో నోటికి వచ్చినట్లు మాట్లాడిన గుంతకల్ ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మండపేట పార్టీ కార్యాలయంలో ఆయన డిమాండ్ చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

రావులపాలెం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన 102 మందికి రూ.57.84 లక్షలు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు కార్పొరేట్ వైద్యం చేయించుకుంటే గత ప్రభుత్వంలో అప్పులు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని నేడు కూటమి ప్రభుత్వంలో సీఎం సహాయనిధి వారికి అండగా నిలుస్తున్నదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభిరామారావు, ముదునూరి వెంకట్రాజు, ఈదల సత్యనారాయణమూర్తి, కొప్పిశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరేష్, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు పనిచేస్తాం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పవన్‌కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తామని జనసేన నాయకులు పేర్కొన్నారు. గురువారం అంగరలో పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు తోరాటి శ్రీనివాసరావు ఆర్థిక సౌజన్యంతో ఇంటింటికి వెళ్లి గాజు గ్లాసులు, కరపత్రాలను అందజేశారు. మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ సూచన మేరకు దీన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, పిల్లా బసవరాజు, కొమ్మిశెట్టి సూరిబాబు, చల్లాబత్తుల లోవరాజు, తోరాటి నారాయణస్వామి, దానేటి శరత్, కుడకా శ్రీను, కొంపెల్ల రాంబాబుశర్మ తదితరులు, నాయకులు, యువకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనసేనపార్టీ నాయకులు

ఉపాధ్యాయులైన విద్యార్థులు

ఆత్రేయపురం, సెప్టెంబరు (4ఆంధ్రజ్యోతి): ర్యాలి ప్రాథమిక ప్రధాన ఫౌండేషన్ పాఠశాలలో 1, 2 తరగతి చదువుతున్న చిన్నారులు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుల వేషధారణలో ఒక్కరోజు ఉపాధ్యాయులుగా పాఠశాలను నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పుతున్న హెచ్ఎం శ్యామ్‌కుమార్‌ను సత్కరించారు.

పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్‌పై శిక్షణ

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్‌పై మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ జి.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో ఆర్.మోహన్, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవం

రావులపాలెం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముందుస్తు గురు పూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువులను ఘనంగా సత్కరించారు.

కె.గంగవరం పాఠశాలల్లో..

కె.గంగవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. రాధాకృష్ణన్ పుట్టిన రోజును పుర స్కరించుకుని ఉపాధ్యాయులు కేక్ కట్ చేశా రు. పామర్రులో విశ్రాంత ఉపాధ్యాయుడు చిట్టూరి రామ్మోహన్‌రావును ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎర్ర ఈశ్వరుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ధనమహాలక్ష్మి ఎంపిక

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురం మండలం నల్లూరు మోడల్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వాసా ధనమహాలక్ష్మి ఉత్తమ ఉపా.ధ్యాయ అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును అమలాపురంలో శుక్రవారం నిర్వహించే సభలో కలెక్టర్ మహేష్‌కుమార్, డీఈవో ఎస్‌కె సలీం భాషా నుంచి అందుకోనున్నారు.

నలుగురు ఎంపిక

రాయవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేస్తున్న నలుగురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈవో-2 వై.సూర్యనారాయణ తెలిపారు. గురువారం మాట్లాడుతూ పసలపూడి ఉన్నత పాఠశాల హెచ్ఎం నూలు ఆదినారాయణ, సోమేశ్వరం పాఠశాలలో గరగ సీతాదేవి, వెదురుపాక ఉన్నత పాఠశాల సంపర వేణుగోపాల సింగ్‌బాబు, పసలపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాలకు చెందిన కె.వెంకటరమణ ఎంపికైనట్లు తెలిపారు.


మడికిలో పారిశుధ్య నిర్వహణపై సమీక్షిస్తున్న జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం తగదు

జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్

ఆలమూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం జరగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్ సూచించారు. మడికిలో గురువారం పారిశుధ్య, వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై ఆయన ఎంపీడీవో రాజు కలసి పంచాయతీ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కూటమి నాయకుడు దొండపాటి సుబ్బరాజు తదితరులు నర్సరీ ప్లాంట్‌ను అందించి స్వాగతం పలికారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

ఆలమూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిపై ప్రజాప్రతినిదులు, అధికారులు సమష్టిగా ముందస్తు ప్రణాళికలను రూపొందించాలని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు సూచించారు. ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వివిద శాఖల అధికారులకు అభివృద్ధి ప్రణాళికలపై ఒకరోజు శిక్షణ తరగతులు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. గ్రామాలకు వచ్చే నిధులను అంచనా వేసుకుని గ్రామంలో చేపట్టాల్సిన పనుల ప్రాధాన్యత ప్రకారం చేసేలా ఎంపిక చేయాలని ఎంపీడీవో కోరారు. గ్రామాల్లో అమలు జరుగుతున్న పారిశుధ్యం, వేస్ట్ మెనేజ్‌మెంట్ కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



గణేష్ నిమజ్జనాలు ప్రారంభం

కె.గంగవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి గోదావరి వద్ద వినాయక నిమజ్జనాలు గురువారం ప్రారంభమయ్యాయి. వినాయక చవితి ఉత్సవాలు ముగించుకున్న తదుపరి నిర్వాహకులు గణేష్ విగ్రహాలను నిమజ్జనం కోసం కోటిపల్లి గోదావరి వద్దకు తీసుకువస్తున్నారు. గురువారం రెండు విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం కోసం పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కోటిపల్లి గోదావరి రేవులో పడవలు ఏర్పాటు చేశారు. విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. శనివారం అత్యధికంగా 200 విగ్రహాలు నిమజ్జనం కోసం తరలి వస్తాయని, తదనుగుణంగా ఏర్పాట్ల చేస్తున్నామని తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్, ఎస్.ఐ. ఎస్.కె. జానీబాషాలు చెప్పారు. వారు నిమజ్జనం కోసం చేసిన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఏఆర్‌టీ సెంటర్ పరిశీలన

రామచంద్రపురం(ద్రాక్షారామ),సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌ను గురువారం జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ బృందం పరిశీలించింది. సీడీసీ సాంకేతిక అధికారి డాక్టర్ సుధీర్‌చావ్లా, జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సీఎస్‌టీ డివిజన్ కన్సల్‌టెంట్ డాక్టర్ జెస్వీందర్ సింగ్, సాలెం, ఏఆర్‌టీ సెంటర్ ఎస్ఎంవో డాక్టర్ అరుణాచలం, ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సీఎస్‌టీ డివిజన్ డిప్యూటీ డైరెక్టరు డాక్టర్ చక్రవర్తి పరిశీలన జరిపిన వారిలో ఉన్నారు. ఏఆర్‌టీ సెంటర్, ఆసుపత్రి సేవలపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ తెలిపారు.

శబరిమలలో ఎమ్మెల్యేకు స్వాగతం

మండపేట సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం శబరిమలలోని అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. అయ్యప్పమాల ధరించిన ఆయన శబరిమలకు వెళ్లగా కేరళ ప్రభుత్వం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికింది. ఆలయంలో ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించింది. మొక్కు తీర్చుకున్న అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు ఆలయ నిర్వాహకులు అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు మండపేట నుంచి వెళ్లిన సహచర స్వాములు కూడా స్వామివారిని దర్శించుకున్నారు.



కాళహస్తీశ్వరుడికి నాగాభరణం అందజేత

మండపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండపేటకు చెందిన శిల్పి వాసా శ్రీనివాసరావ శ్రీకాళహస్తీశ్వరస్వామికి తన సొంత నిధులతో తయారు చేసి అందజేశారు. రూ లక్ష 22 వేలు విలువైన రాగి నాగాభరణాలను గోల్డ్ ప్లేటెడ్‌తో తయారు చేసి శుక్రవారం ఆలయ చైర్మన్ కోలా ఆనంద్, ఈవో బాపిరెడ్డిలకు అందజేశారు.

విత్తనాల పంపిణీ

ఆత్రేయపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వద్దిపర్రులో గురువారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మార్తమ్మ, శ్యామల నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. ప్రకృతి సాగు చేస్తున్న రైతు వాకలపూడి వెంకటేశ్వరరావుకు అందచేశారు. వీటిని సాగుచేయడం వల్ల దిగుబడితో పాటు ఆరోగ్యకరంగా ఉంటుందని తెలిపారు.

పొగబెట్టక పగపడుతున్నాయి..

• గ్రామాల్లో చీకటిపడితే విజృంభిస్తున్న దోమలు • చోద్యం చూస్తున్న యంత్రాంగం

మండపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించటంతో దోమలు మోత ఎక్కువైంది. చీకటి పడితే చాలు ప్రజలపై దండయాత్ర చేస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించకపోవడమే కారణమని తెలుస్తున్నది. గత ప్రభుత్వంలో దోమల నిర్మూలన కోసం అన్ని పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలను అందజేశారు. అధికారుల పర్యవేక్షణ లేక మూడో వంతు కూడా వాడటం లేదని తెలుస్తున్నది. కొన్నిచోట్ల ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరగా మరి కొన్నిచోట్ల మాత్రం వాటిని వినియోగించిన సందర్భాలు కనిపించటం లేదు. దీంతో డ్రైన్‌లు, రోడ్డు పక్క వేసిన వ్యర్థాలతో దోమలు పెరిగిపోయి ప్రజలపై దాడి చేస్తూ అనారోగ్యానికి గురిచేస్తున్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆయా పంచాయతీల్లో ఎక్కడా కూడా ఫాగింగ్ యంత్రాలను వాడుతున్న దాఖలాలు లేవని సమాచారం. ఆయా పంచాయతీలు 90 శాతం మేర ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశాయని జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మీ తెలిపారు.

లోపాలివే: చిన్న పంచాయతీలు ఏడు వారా లపాటు ఫాగింగ్ యంత్రం వినియోగించాలంటే రూ.20వేలు వరకు వ్యయం అవుతుందని తెలిసింది. అదే పెద్ద పంచాయతీ అయితే రూ. 50 వేలు వ్యయం అవుతుందని పంచాయతీ అధికారి ఒకరు తెలిపారు. అందువల్లనే గ్రామా ల్లో ప్రభుత్వం అందించిన ఫాగింగ్ మిషన్‌లను వాడటం లేదని ఆయన అన్నారు. అదే విధంగా ఫాగింగ్ యంత్రాలను ఉపయోగించే విధానంపై పంచాయతీ సిబ్బందికి సరైన శిక్షణ, కనీస అవగాహన లేదని ఆయన తెలిపారు. సాంకేతిక సమస్యతోపాటు, ఫాగింగ్ యంత్రం పాడైతే మరమ్మతులు చేసేవారు కూడా లేకపోవటంతో కొన్నిచోట్ల ఆయా పంచాయతీల్లో వృధాగా పడి వున్నాయన్నారు. ఫాగింగ్ యంత్రాలను పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవటంతో పాటు సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచిస్తున్నారు. దోమల నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికలు

మండపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా మండపేటకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని మండల విద్యాధికారి నాయుడు రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండపేట ఏడిద రోడ్డులో వున్న వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రేలంగి నాగ కుమార్, వేగుళ్ల వీర్రాజు మున్సిపల్ హైస్కూల్లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న మేకా రామలక్ష్మి, కేశవరంలో వున్న ఎంపీపీ పాఠశాల హెచ్ఎం చోడే కృష్ణమూర్తి ఎంపికయ్యారన్నారు.

కె.గంగవరంలో ఇద్దరు

కె.గంగవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు, ఓదూరి వెంకట రమణ ఎంపికైనట్లు ఎంపీవో ఏ.నాగరాజు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అమలాపురంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఎంఈవో తెలిపారు.

ఆలమూరులో ఇద్దరు

ఆలమూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. చింతలూరు ఎంపీపీ పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న వుడతా వెంకటేశ్వరరావు, ఆలమూరు శెట్టిబలిజపేట మోడల్ ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తున్న కూనల నాగరాణి ఎంపికైనట్లు తెలిపారు.

ఆత్రేయపురంలో ఒకరు

ఆత్రేయపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆత్రేయపురం మండలం మెర్లపాలెం శివారు వాసంశెట్టివారిపాలెం హెచ్ఎం గూడపాటి మాణిక్యాలరావు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎక్కడ పనిచేసినా విద్యార్థుల అభివృద్ధితో పాటు పాఠశాల అభివృద్ధికి కృషిచేయడంతో అవార్డుకు ఎంపికయ్యారు.

కొత్తపేటలో ఒకరు

కొత్తపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొత్తపేట బోడిపాలెం మోడ్రన్ ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయరాలుగా పనిచేస్తున్న వెలుగొట్ల జయావతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయరాలిగా ఎంపికైనట్లు ఎంఈవో ఎం.హరిప్రసాద్ తెలిపారు. ఈమె 27 సంవత్సరాలుగా పలు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డుకు ఎంపికైన్నట్లు తెలిపారు.

పరిశుభ్రమైన వాతావరణం వ్యాధుల వ్యాప్తిని తగ్గిస్తుంది

కె.గంగవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శుభ్రమైన వాతావరణం వ్యాధుల వ్యాప్తిని తగ్గిస్తుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వీవీ సత్యనారాయణ అన్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఆయన దంగేరు ఆసుపత్రిని సందర్శించారు. పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు జాయ్ కేథరిన్, ప్రతాప్, నరేన్, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమలేష్, పద్మేష్ బాబు, గుడాల శ్రీమన్నారాయణ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై ఉన్నతాధికారుల విచారణ

రావులపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం శ్రీనివాసనగర్‌లో గతనెల 27న గుర్తు తెలియని వ్యక్తి మృతికి సంబంధించి ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేస్తున్నారని సీఐ శేఖర్ తెలిపారు. గురువారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమానాస్పద మృతిపై వదం తులు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. పోలీస్‌స్టేషన్‌లో లాకప్‌డెత్ జరిగినట్లు వస్తున్న వదంతు లు అవాస్తమని, ఇవి రెండు వేర్వేరు సంఘటనలు అన్నారు. గతనెల 24న తెల్లవారుజామున మతిస్థిమితం లేని ఒకవ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నాడంటూ స్థానికులు స్టేషన్‌కు వచ్చి తెలపడంతో స్టేషన్‌కు తీసుకువచ్చామన్నారు. ఆ వ్యక్తి మతిస్థిమితంలేని వ్యక్తిగా గుర్తించి స్టేషన్‌లో ఉంచి అనంతరం పంపించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆ సమయంలో స్టేషన్ నుంచి ఆ వ్యక్తి తప్పించుకుని వెళ్లిపోయాడన్నారు. స్టేషన్ నుంచి వెళ్లిపోతున్న సీసీ కెమెరాల పుటేజీలను ఉన్నతాధికారులు పరిశీలించారని అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి, మతిస్థిమితం లేకుండా వెళ్లిపోయిన వ్యక్తి ఒక్కరేనని ఆరోపణలు వస్తున్నాయని దీనిపై సమగ్ర విచారణ జరుగుతోందని సీఐ తెలిపారు.


సీఐ శేఖర్‌బాబు

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విజయవాడకు చెందిన మాదిరెడ్డి నాగశ్రీనివాస్, ఝాన్సీరాణి దంపతులు రూ.1,00,116, నర్సీపట్నానికి చెందిన కల్లా శేష కుమారి, సత్యసాయి పవన్ రూ.1,00,116 విరాళాలు సమర్పించారు. దాతలకు ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాలు అందజేశారు.

ఆదివారం మధ్యాహ్నం వరకే దర్శనం: చంద్రగ్రహణం సందర్భంగా వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం మధ్యాహ్నం 1 గంట వరకూ మాత్రమే స్వామివారి దర్శనాలు ఉంటాయని ఆలయ ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆలయాన్ని మూసివేసి సంప్రోక్షణ అనంతరం ఉదయం 7 గంటల నుంచి భక్తులకు దర్శనాలు ఉంటాయన్నారు.

కళాకారులకు సన్మానం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంగరలో శ్రీ ఆదిగణపతి గత ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భజన కళాకారులకు గురువారం ఆలయ కమిటీ, తాపీమేస్త్రిల సంఘం ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. గ్రామంలో దీర్ఘకాలంగా ఆదిగణపతి ఉత్సవ నిర్వహణకు సహకరిస్తున్న నిర్వాహకులు, భజన కళాకారులను ఆలయ పందిరిలో సత్కరించారు. పెద్దింశెట్టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మానంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీల పురోభివృద్ధిపై శిక్షణ

ఆత్రేయపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్, ఎంపీటీసీలకు పంచాయతీల పురోభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామన్ ప్రజాప్రతినిధులకు శిక్షణ అందించారు. పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు శానిటేషన్, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు అంశాలపై శిక్షణ అందచేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

మండపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో కే.సత్యనారాయణ మూర్తి సారథ్యంలో పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ పి.ఎ.ఐ.2.0 శిక్షణ కార్యక్రమం జరిగింది. స్థానిక సంస్థలు అభివృద్ధి వైపు ఎలా చేయాలనే దానిపై ఎంపీడీవో సచివాలయ ఉద్యోగులకు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు వివరించారు. ఒకరోజు జరిగిన శిక్షణకు గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వైస్ ఎంపీపీలు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు ఎ.వీ.వీ. రమణ, అమర్‌నాథ్, సుబ్బారావు, ప్రసాద్, పి.శ్రీనివాస్, ప్రసాద్, వర్మ తదితరులు పాల్గొన్నారు.


రాయవరం మోడల్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ తదితరులు

మోడల్ పాఠశాలను తనిఖీ చేసిన ప్రజా ప్రతినిధులు

రాయవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాయవరం మోడల్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంపీపీ నౌడు వెంకటరమణ, జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత ఏవిధంగా ఉంది అనే విషయాన్ని పరిశీలించడంతో పాటు విద్యార్థులతో కలిసి ప్రజా ప్రతినిధులు మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ఎంఈవో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

శిక్షణ తరగతులు పరిశీలన

రామచంద్రపురం(ద్రాక్షారామ) సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ తరగతులను జిల్లా అదనపు ఆరోగ్య వైద్యశాఖాధికారి డాక్టర్ భరతలక్ష్మి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వైద్యులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ లోవసుధ, డాక్టర్ రాధాకుమారి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజినల్ పర్యవేక్షకుడు జి.కమలేశు, ఫిజియోథెరపిస్టు మేఘన, టీబీ యూనిట్ డి.లీల, భానుబేగం తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి తొండం రూపంలో కొబ్బరికాయ

భక్తుల పూజలు



రాయవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పసలపూడి శివారు ఎర్రమట్టిపురం ప్రాంతానికి చెందిన వెంకట కృష్ణ ఇంట్లో ఉన్న చెట్టుకి ఉన్న కొబ్బరి కాయలను పరిశీలించగా చెట్టుకు ఉన్న కొబ్బరికాయల్లో ఒకటి వినాయకుడి తొండం రూపంలో ఉండటంతో శుభప్రదంగా భావించి పూజలు చేశారు. కొబ్బరికాయను స్థానిక వినాయక ఆలయ పూజారి తుట్టగంట శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ పూజల్లో చిన్నం వెంకయ్య, సత్తిబాబు, కొవ్వూరి జొన్నారెడ్డి, పడాల ఆంజనేయరెడ్డి, మల్లిడి రామారెడ్డి, నక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పామర్రులో యూటీఎఫ్ సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

కె.గంగవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ కృషి చేస్తుందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రకుమార్ అన్నారు. గురువారం ఆయన యూటీఎఫ్ నాయకులతో కలసి పామర్రు, సత్యవాడ, కూళ్ల, సుందరపల్లి, గంగవరం, కోటిపల్లి, దంగేరు, కుందూరు, కోట, శివల, అద్దంపల్లి ఉన్నత పాఠశాలల్లో పర్యటించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.ప్రదీప్‌కుమార్ నాయకులు దాసరి శ్రీనివాసు, ఎస్.రవి, టి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావును అభినందించిన సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్

రాయవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడ సాల్ట్ కార్యాలయంలో జరిగిన సమగ్రశిక్ష సోషల్ ఆక్టివిటీస్ట్ శిక్షణలో పాల్గొన్న వెదురుపాక గ్రామానికి చెందిన గణిత ఉపాధ్యాయుడు పాలెపు శ్రీనివాసరావును సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు అభినందించారు. గురువారం వెదురుపాకలో శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేరీతిలో సోషల్ మీడియా ద్వారా పాఠాలను ఉచితంగా అందిస్తున్న 40 మంది ఉపాధ్యాయులతో రాష్ట్ర సమగ్రశిక్ష ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించినట్లు చెప్పారు. ఈ శిక్షణలో గణితాన్ని పాటల రూపంలో విద్యార్థులకు అందిస్తున్నందుకు తనను స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ అభినందించినట్లు చెప్పారు.